ONE click
ePaper
www.shanmukhavelugu.com

RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 266
ఆదివారం 11 అక్టోబర్ 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.



## నైపుణ్యాలు పెంచుకోండి

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,అక్టోబర్ 10)

సాంకేతిక పరిజ్ఞానం వేగంగా పరిణామం చెందుతున్న నేపథ్యంలో యువత కొత్త నైపుణ్యాలు పెంపొందించుకోవడంతోపాటు తమ ప్రస్తుత సామర్థ్యాన్ని పెంచుకోవాలని, మారుతున్న సాంకేతికతల్ని అందిపుచ్చు కోవాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం పేర్కొన్నారు. చైనాలోని షాంఘైలో జరిగిన ప్రపంచ నైపుణ్యాల పోటీలో పాల్గొని తిరిగి వచ్చిన భారత ప్రతినిధులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశాన్ని నైపుణ్యాలు కలిగిన మానవ వనరుల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు యువత, ప్రభుత్వం, శిక్షణ సంస్థలు కలిసి పనిచేయాలని ప్రధాని పిలుపునిచ్చారు. ప్రత్యేక నైపుణ్యాల ప్రాధాన్యతను నొక్కి చెబుతూ యువత అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, ప్రపంచ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలకు సానపట్టాలని అన్నారు. యువత తమ అనుభవాలు, సూచనలతో భారత నైపుణ్య శిక్షణ వ్యవస్థ మెరుగుదలకు దోహదపడాలన్నారు. కేంద్రంలో ప్రత్యేకమైన నైపుణ్యాభివృద్ధి శాఖ ఏర్పాటుకు గల కారణాలను వివరిస్తూ నైపుణ్యాలు నేర్పే శిక్షణ సంస్థలు ఐఐటీలు, ఐఐఎంలకు ఏమాత్రం తీసిపోవన్నారు. ప్రపంచ నైపుణ్యాల పోటీలో పాల్గొన్న భారత ప్రతినిధులు ఈ సందర్భంగా ప్రధానితో తమ అనుభవాలను పంచుకున్నారు. ఆ ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని "మీరంతా భారత నైపుణ్యాభివృద్ధి రంగ రాయబారులు" అని వ్యాఖ్యానించారు. చైనాలోని షాంఘైలో గత నెల 22 నుంచి 27 వరకూ 48వ ప్రపంచ నైపుణ్య పోటీలు జరిగాయి.

## బాబు పవన్ విజయ్ ఒకే ఫ్రేమ్... ఏపీకి తమిళ సీఎం !



(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 10)

తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత విజయ్ తొలిసారి ఏపీకి అధికార పర్యటనకు వస్తున్నారు. ఆయన ఈ నెల 13న విజయవాడ టూర్ ఫిక్స్ అయిందని అంటున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ఏపీ సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లతో భేటీ అవుతారు అని తెలుస్తోంది. ముఖ్యంగా తెలుగు గంగ ఒప్పందం గురించి ఆయన కూటమి ప్రభుత్వంలో చర్చిస్తారు అని అంటున్నారు. అలాగే కృష్ణా జలాల వాటా గురించి చర్చ కూడా ఈ భేటీలో జరగనుంది అని అంటున్నారు.

**జల వివాదాలే అజెండా :** ఏపీకి తమిళనాడుకు మధ్య నెలకొన్న జల వివాదాలను పరిష్కరించుకునే నిమిత్తం విజయ్ ఏపీకి వస్తున్నారు అని అంటున్నారు. తెలుగు గంగ ప్రాజెక్ట్ ద్వారా తమిళనాడుకు నీటిని సరఫరా చేసే ఒప్పందం గతంలో కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం ఏపీ నుంచి ప్రతీ ఏడాది 12 టీఎంసీల క్రిష్ణా జలాల నీటిని తమిళనాడుకు అందించాల్సి ఉంది. అయితే ఆ ఒప్పందం సక్రమంగా అమలు కావడం లేదన్నది తమిళనాడు అభ్యంతరంగా ఉంది. ఈ ఏడాది చూస్తే అక్టోబర్ 9 నాటికి కేవలం 2.251 టీఎంసీల నీరు మాత్రమే అందిందని చెబుతున్నారు. ఇంకా 9.749 టీఎంసీల నీరు తమిళనాడుకు సరఫరా కావాల్సి ఉంది. దాంతో తమకు ఒప్పందం మేరకు రావాల్సిన పూర్తి వాటా 12 టీఎంసీల నీటి కోసం తమిళ సీఎం విజయ్ ఏపీ సీఎం చంద్రబాబుతో చర్చిస్తారు అని అంటున్నారు.

**డ్యాముల నిర్మాణం మీద :** అంతే కాకుండా ఏపీ నుంచి తమిళనాడులోకి ప్రవహించే నదుల మీద ఏపీ ప్రభుత్వం డ్యాముల నిర్మాణం చేసేందుకు సిద్ధపడుతోంది అన్న దానిమీద కూడా తమిళనాడు ప్రభుత్వం అభ్యంతరం తెలియచేస్తోంది. ఈ విషయం మీద ముఖా ముఖీ చర్చల ద్వారా ఏపీ ప్రభుత్వంతో ఒక పరిష్కారం కనుగొనాలని విజయ్ చూస్తున్నారు అని అంటున్నారు. ఇక ఏపీ సీఎం చంద్రబాబు తరచూ ఒక మాట అంటున్నారు. కేంద్రం వద్ద కూడా ప్రతిపాదిస్తున్నారు. అదే నదుల అనుసంధానం. గోదావరి కావేరి సహా దక్షిణాది నదులు అన్నీ కూడా ఏకీకృతం చేస్తే కనుక దక్షిణాదిన అతి పెద్ద వాటర్ గ్రిడ్ ఏర్పడుతుందని శాశ్వతంగా అన్ని ▶2లో

## ల్యాండ్ పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లో స్థానిక ఎన్నికలను పెండింగ్ లో పెడుతున్నాం

అమరావతి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని నారాయణ ఆదేశాలు

అక్టోబర్ 2028 నాటికి రాజధాని పూర్తి చేయడమే లక్ష్యమని వెల్లడి

ఐకానిక్ టవర్ల పనులను పరిశీలించిన మంత్రి నారాయణ



(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 10)

ఏపీ రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు 2028 అక్టోబరు నాటికి పూర్తి చేయడమే లక్ష్యమని రాష్ట్ర మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఈరోజు ఆయన రాజధాని ప్రాంతంలో పర్యటించి, ఐకానిక్ టవర్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం సీఆర్డీఏ, ఏడీసీఎల్ అధికారులు, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులతో సమావేశమై పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సం దర్భంగా మంత్రి మాట్లాడుతూ... గత నెలలో వర్షాల కారణంగా పనులకు కొంత ఆటంకం కలిగిందని, ఇప్పుడు పనులు తిరిగి వేగం పుంజుకున్నా యని తెలిపారు. ఐకానిక్ టవర్ల నిర్మాణంలో మొదటి దయాగ్రిడ్ పూర్తయిం దని, ప్రతి రెండు నెలలకు 6 అంతస్తుల నిర్మాణం పూర్తయ్యేలా లక్ష్యం నిర్దేశించామని వివరించారు. ఐకానిక్ అసెంబ్లీ, హైకోర్టు ఫౌండేషన్ పనులు కూడా దాదాపుగా పూర్తయ్యాయని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధుల నివాస భవనాలు తుది దశకు చేరుకున్నాయని, నవంబర్ 11 తర్వాత వాటి ప్రారంభోత్సవాలు ప్రారంభిస్తామని ▶2లో

# పట్టిసీమ ఫలం..

## సీఎం చంద్రబాబుకు కృష్ణా డెల్టా రైతుల కృతజ్ఞతలు

పట్టిసీమ ద్వారా నీరందించిన సీఎం చంద్రబాబును కలిసిన కృష్ణా డెల్టా రైతులు

చంద్రబాబును 'ఏపీ వాటర్ మ్యాన్' అంటూ శాలువాతో సత్కరించిన రైతులు

పట్టిసీమతో 11 ఏళ్లలో 500 టీఎంసీల గోదావరి నీటిని కృష్ణాకు తరలించామన్న సీఎం

పొదుపు చేసిన కృష్ణా జలాలను రాయలసీమకు ఇచ్చామని వెల్లడి

ఇరిగేషన్ క్యాలెండర్ ప్రకారం ప్రాజెక్టులు పూర్తి చేస్తామని హామీ



(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 10)

పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా డెల్టాకు జల భరోసా కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి డెల్టా రైతులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. శనివారం సచివాలయంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి సీఎంను కలిసిన రైతులు.. ఆయనను శాలువాతో సత్కరించి, తమ అభిమానాన్ని చాటుకున్నారు. చంద్రబాబును 'ఏపీ వాటర్ మ్యాన్'గా, 'జలప్రదాత'గా అభివర్ణిస్తూ ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. పట్టిసీమ ద్వారా గోదావరి వరద నీటిని కృష్ణా డెల్టాకు తరలించి, అదే సమయంలో శ్రీశైలంలో పొదుపు చేసిన కృష్ణా జలాలను రాయలసీమకు అందించి అన్ని ప్రాంతాలకు న్యాయం చేశారని కొనియాడారు. కేవలం చంద్రబాబు ▶2లో

## పార్టీపరంగా బీసీ రిజర్వేషన్లు – టీడీపీ కీలక నిర్ణయం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 10)

స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై అధికార టీడీపీ కీలక నిర్ణయం తీసుకుంది. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే జీవోను సుప్రీంకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో పార్టీ తరఫున ఆ మేరకు రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించింది. బీసీలకు రాజ్యాధికారం, గౌరవం పెరిగేలా చూడటమే టీడీపీ బాధ్యత అంటూ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. రిజర్వేషన్లకు అమలు చేయడంలో న్యాయపరమైన అడ్డంకులు ఎదురైనప్పటికీ, పార్టీ పరంగా వెనక్కి తగ్గకూడదని టీడీపీ భావిస్తోంది. ఈ మేరకు గతంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు సంకేతాలు ఇవ్వగా, సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే అధికారికంగా ప్రకటించింది. బీసీల రాజకీయ భవిష్యత్తు, గౌరవాన్ని కాపాడేందుకు పార్టీ తరఫునే రిజర్వేషన్లను అమలు చేస్తామని చెప్పడమే కాకుండా, తమది బీసీల పార్టీగా నిబద్ధతను చాటుకునే ప్రయత్నం చేసిందని అంటున్నారు. గత ప్రభుత్వం బీసీలకు చేసిన నష్టాన్ని పూడ్చేలా, వారికి సముచిత స్థానం కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ▶2లో

## భారత్‌కు ఒక నీతి.. అమెరికాకు మరో నీతా?

ట్రంప్ డీజిల్ ఒప్పందంపై విమర్శలు!

రష్యా నుంచి డీజిల్ కొనుగోలుకు ట్రంప్ అంగీకారం

రష్యా డీజిల్ లావాదేవీలపై ఆంక్షలను సడలించిన అమెరికా



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,అక్టోబర్ 10)

రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందంటూ భారత్‌పై సుంకాల విషయంలో ఒత్తిడి తెచ్చిన అమెరికా.. ఇప్పుడు అదే దేశం నుంచి డీజిల్ తెప్పించుకోవడానికి సిద్ధమైంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం అమెరికాలోనే విమర్శలకు దారితీసింది. భారత్ విషయంలో ఒకలా, తన విషయంలో మరోలా వ్యవహరిస్తున్నారంటూ రాజకీయ నాయకులు, జర్నలిస్టులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు ప్రశ్నిస్తున్నారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అమెరికా, ప్రపంచ మార్కెట్లకు భారీ మొత్తంలో డీజిల్ సరఫరా చేసేందుకు అంగీకరించారని ట్రంప్ శుక్రవారం ప్రకటించారు. ఈ నేపథ్యంలో రష్యా డీజిల్ లావాదేవీలపై కొన్ని ఆంక్షలను అమెరికా ఆర్థిక శాఖ తాత్కాలికంగా సడలించింది. అయితే, రష్యా చమురు, గ్యాస్ కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించేందుకు వీలు కల్పించే చట్టంపై ట్రంప్ సంతకం చేసిన కొన్ని వారాలకే ఈ పరిణామం చోటుచేసుకోవడం చర్చనీయాంశమైంది.

**అమెరికాపై సొంత దేశంలోనే విమర్శలు**

అమెరికా జర్నలిస్టు క్యాథరిన్ రాంపెల్ ఈ నిర్ణయంలోని వైరుధ్యాన్ని ప్రశ్నించారు. రష్యా ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నందుకు అమెరికా తనపైనా సుంకాలు విధించుకుంటుందా? అంటూ 'ఎక్స్'లో ప్రశ్నించారు. రాజకీయ జర్నలిస్టు సామ్ స్టెయిన్ కూడా ట్రంప్ వైఖరిని ప్రస్తావించారు. రష్యాపై ఆర్థిక ఒత్తిడి పెంచేందుకు ఉద్దేశించిన ఆంక్షల చట్టంపై ఇటీవలే సంతకం చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ.. ఇప్పుడు అదే దేశం నుంచి ఇంధనం కొనుగోలు చేయడం ఏంటని ప్రశ్నించారు. సోషల్ మీడియాలోనూ ఇదే అంశంపై చర్చ జరుగుతోంది. రష్యా చమురు ▶2లో

## ఓట్లు మూకుమ్మడిగా తొలగించారనేది అపోహ మాత్రమే

(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 10)

దేశంలో తాజా రాజకీయ పరిణామాలు, ఈసీపై వస్తోన్న విమర్శలపై మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు స్పందించారు. కృష్ణా జిల్లా ఆత్కూరులో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగ బద్ధ సంస్థను రాజకీయాలతో ముడిపెట్టడం సరికాదన్నారు. "ఎన్నికల సంఘంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఇవాళ ప్రతిపక్షాలు అతిగా ప్రవర్తిస్తున్నాయి. రాజీనామా కోరడం తప్పు కాదు.. వ్యక్తిగత విమర్శలు సరికాదు. ఓట్లను మూకుమ్మడిగా తొలగించారనేది అపోహ మాత్రమే. సీఈసీ, ప్రధాని రాజీనామా చేయాలన్న డిమాండ్ సమంజసం కాదు. గెలిస్తే తమ ఘనత అని.. ఓడిపోతే మాత్రం ఈవీఎంలను నిందిస్తున్నారు. దేశవ్యాప్తంగా ▶2లో



## జగన్‌కు ఈడీ షాక్..

### అక్రమాస్తుల కేసులపై హైకోర్టును ఆశ్రయించిన ఏజెన్సీ

(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 10)

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించిన అక్రమాస్తుల కేసుల విచారణను వేగవంతం చేయాలని కోరుతూ 'ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్' (ఈడీ) తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసుల్లో రోజువారీ విచారణ జరిపి, త్వరితగతిన పరిష్కరించేలా ఆదేశాలు ఇవ్వాలని ఈడీ తన పిటిషన్‌లో అభ్యర్థించింది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసులకు సంబంధించి ఈడీ దాఖలు చేసిన తొమ్మిది చార్జిషీట్లు దాదాపు దశాబ్ద కాలంగా సీబీఐ ప్రత్యేక కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని ఈడీ తెలిపింది. నిందితులు దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్లు పరిష్కారం కాకపోవడం వల్లే విచారణ ముందుకు సాగడం లేదని పేర్కొంది. ▶2లో



మొదటిపేజీ తరువాయి

## పట్టిసీమ ఫలం..

ముందుచూపుతోనే ఇది సాధ్యమైందని, ఆయన కృషితోనే కృష్ణా డెల్టా సస్యశ్యామలమైందని అన్నారు. పట్టిసీమ ద్వారా ఇప్పటివరకు సుమారు 500 టీఎంసీల నీటిని తమ ప్రాంతానికి అందించడం చరిత్రాత్మకమని పేర్కొన్నారు.రైతుల అభినందనలకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ, వారికి ధన్యవాదాలు తెలిపారు. పట్టిసీమ ద్వారా వచ్చిన నీటితో కృష్ణా డెల్టాలో సిరులు పండించిన రైతుల కృషిని ఆయన అభినందించారు. "పట్టిసీమ లిఫ్ట్ ద్వారా గత 11 ఏళ్లలో 500 టీఎంసీల గోదావరి వరద నీటిని కృష్ణా బేసిన్‌కు విజయవంతంగా తరలించాం. ఈ ప్రాజెక్టుతో సాధించిన జలవిజయం ఎంతో సంతోషాన్నిచ్చింది. ఈ ఆలోచన వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశం డెల్టా రైతుల కష్టాలు తీర్చి, సంపద సృష్టించడమే," అని సీఎం వివరించారు.

పట్టిసీమ విజయంతో రెండు ప్రాంతాలకు మేలు జరిగిందని చంద్రబాబు తెలిపారు. గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌లో వినియోగించుకోవడం ద్వారా పొదుపు చేసిన కృష్ణా జలాలను రాయలసీమలోని సాగు, తాగునీటి అవసరాలకు మళ్లించగలిగామని చెప్పారు. దీనివల్లే రాయలసీమలో 'కియా' వంటి ప్రతిష్ఠాత్మక పరిశ్రమలకు కూడా నీటిని అందించడం సాధ్యమైందని స్పష్టం చేశారు. రాష్ట్రానికి సంపూర్ణ జల భద్రత కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఇరిగేషన్ క్యాలెండర్‌ను పక్కాగా అమలు చేసి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు.

## ల్యాండ్ పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లో స్థానిక ఎన్నికలను పెండింగ్ లో పెడుతున్నాం

వెల్లడించారు. ల్యాండ్ పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లో ప్రస్తుతానికి స్థానిక ఎన్నికలను పెండింగ్ లో పెడుతున్నామని తెలిపారు.రాజధాని నిర్మాణంపై కొందరు అవాకులు చవాకులు పేలుతున్నారని నారాయణ మండిపడ్డారు. విమర్శలు చేసేవారు అమరావతికి వచ్చి ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిని చూస్తే వాస్తవాలు తెలుస్తాయని అన్నారు. ప్రస్తుతం రాజధాని నిర్మాణ పనుల్లో 35 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. పనులను వేగవంతం చేసేందుకు ప్రతి నిర్మాణ సంస్థకు స్పష్టమైన టార్గెట్లు విధించామని పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ కోసం ల్యాండ్ పూలింగ్ చాలా వరకు పూర్తయిందని, డిసెంబర్ నాటికి రోడ్ నెట్‌వర్క్‌కు సంబంధించి సింగపూర్ మాస్టర్ ప్లాన్ సిద్ధమవుతుందని వెల్లడించారు.

## జగన్‌కు ఈడీ షాక్..

విచారణకు జగన్‌తో పాటు ఇతర నిందితులంతా వ్యక్తిగతంగా హాజరయ్యేలా ఆదేశించాలని కూడా ఉన్నత న్యాయస్థానాన్ని కోరింది. గత కొన్నేళ్లుగా ఈ కేసుల్లో ప్రత్యేక కోర్టుల విచారణ, ఉన్నత న్యాయస్థానాల్లో సవాళ్లు వంటి పలు న్యాయపరమైన ప్రక్రియలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌పై తదుపరి విచారణ జరగాల్సి ఉంది.

## పార్టీపరంగా బీసీ రిజర్వేషన్లు – టీడీపీ కీలక నిర్ణయం

జీవో 105, జీవో 1065లను తీసుకువచ్చిందని టీడీపీ నేతలు గుర్తు చేశారు. అయితే, ఈ జీవోలను వ్యతిరేకిస్తూ కొందరు హైకోర్టును ఆశ్రయించడంతో న్యాయపరమైన చిక్కులు ఎదురైనట్లుగా చెబుతోంది.వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీల రిజర్వేషన్ పెంపుపై కనీస ప్రయత్నం జరగకలేదని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో తమ పార్టీ వెనక్కి తగ్గకుండా సుప్రీంకోర్టును ఆశ్రయించిందని గుర్తు చేస్తున్నారు. స్వయంగా బీసీ మంత్రులు ఢిల్లీకి వెళ్లి న్యాయ నిపుణులతో చర్చలు జరిపారని, సానుకూల నిర్ణయం కోసం సీనియర్ అడ్వకేట్లను నియమించినట్లు వెల్లడించింది. అయినప్పటికీ, దురదృష్టవశాత్తూ సుప్రీంకోర్టు 34 శాతం రిజర్వేషన్లను అనుమతించలేదని విచారం వ్యక్తం చేసింది. న్యాయస్థానాల నుంచి ఆశించిన తీర్పు రానంత మాత్రాన బీసీల విషయంలో తాము వెనక్కి తగ్గేది లేదని టీడీపీ తేల్చిచెప్పింది. చట్టపరంగా బీసీలకు న్యాయం చేయలేకపోయినా, రాజకీయ పార్టీగా పూర్తి బాధ్యత తీసుకుని న్యాయం చేస్తామని ప్రకటించింది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పిస్తామని, ఎక్కడా తగ్గకుండా 34 శాతం సీట్లను బీసీ వర్గాలకే కేటాయిస్తామని స్పష్టం చేసింది. దీనివల్ల బీసీల రాజకీయ గౌరవం దెబ్బతినకుండా స్థానిక సంస్థల్లో వారి ప్రాతినిధ్యం మరింత పెరుగుతుందని పార్టీ ఆశాభావం వ్యక్తం చేసింది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి బీసీలకు రాజ్యాధికారం, రాజకీయ గళం వినిపించే అవకాశాలు కల్పించిన చరిత్ర టీడీపీదని తెలిపింది.కాలక్రమేణా ఈ విధానాన్ని మరింత ముందుకు తీసుకువెళుతూ 1995లోనే స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లను 34 శాతానికి పెంచినట్లు వెల్లడించింది. అయితే, గత పాలకుల కారణంగా 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి కుదించారని, దీనివల్ల సుమారు 16,800 మంది బీసీలు తమ పదవులు కోల్పోవాల్సి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేసింది. కేవలం రాజకీయ రిజర్వేషన్లే కాకుండా, సంక్షేమ రంగంలోనూ బీసీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని వివరించింది.

## భారత్‌కు ఒక నీతి.. అమెరికాకు మరో నీతా?

కొనుగోలు చేయడం ద్వారా ఉక్రెయిన్ యుద్ధానికి భారత్ నిధులు సమకూరుస్తోందని గతంలో అమెరికా విమర్శించిందని పలువురు గుర్తుచేస్తున్నారు. మరి రష్యా నుంచి అమెరికా ఇంధనం కొనుగోలు చేస్తే అదే సూత్రం వర్తించదా? అని ప్రశ్నిస్తున్నారు.

**అమెరికా సెనేటర్ల అభ్యంతరం**

రష్యా డీజిల్ విక్రయాలకు ఆరు నెలలపాటు అనుమతించడాన్ని డెమోక్రటిక్ పార్టీ సెనేటర్లు జీన్ షహీన్, చక్ షుమర్, ఎలిజబెత్ వారెన్ తప్పుబట్టారు. ఈ నిర్ణయం ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్న రష్యాకు ఆదాయాన్ని పెంచుతుందని, మాస్కోపై ఒత్తిడి తగ్గుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. రష్యా చమురు రవాణా నౌకలు, ఆర్థిక వ్యవస్థలు, సైనిక సాంకేతికత సరఫరాదారులపై కఠిన ఆంక్షలు అమలు చేయాలని గతంలోనూ అమెరికా చట్టసభ సభ్యులు కోరారు.

**ధరలు తగ్గించేందుకే: ట్రంప్**

అమెరికాలో ఇంధన ధరలను తగ్గించేందుకే రష్యా నుంచి అదనపు డీజిల్ తెప్పించుకుంటున్నామని ట్రంప్ సమర్థించుకున్నారు. వినియోగదారులు, రైతులు, ట్రక్కుల యజమానులకు ఇంధనం అందుబాటులో ఉండాలంటే ఈ సరఫరాలు అవసరమని చెప్పారు.

ట్రంప్ ప్రకటన ప్రకారం.. రష్యా తొలుత 3 లక్షల టన్నులకు పైగా డీజిల్ సరఫరా చేయనుంది. నవంబరులో 5 లక్షల టన్నులు, ఆ తర్వాత 10 లక్షల టన్నులు అందించనుంది. తదుపరి సరఫరాలు రిఫైనరీల సామర్థ్యంపై ఆధారపడి ఉంటాయి. రష్యా నుంచి వచ్చే డీజిల్‌కు సంబంధించి నిర్దిష్ట లావాదేవీలను 2027 ఏప్రిల్ వరకు అనుమతిస్తూ అమెరికా ఆర్థిక శాఖ జనరల్ లైసెన్స్ 135 జారీ చేసింది.మరోవైపు, రష్యాకు అదనపు ఇంధన ఆదాయం అందించడం వల్ల ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని కొనసాగించే సామర్థ్యం పెరుగుతుందని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్స్కీ ఆందోళన వ్యక్తం చేశారు.

## ఓట్లు మూకుమ్మడిగా తొలగించారనేది అపోహ మాత్రమే

13 కోట్ల మంది ఓటర్లను తొలగించారనడం అవాస్తవం. రాజ్యాంగబద్ధ సంస్థను వీధుల్లోకి లాగడం తగదు. ఐక్యంగా ఉన్నామని ఎన్నికల సంఘం సభ్యులు చెబుతున్నారు. ప్రతిపక్షాలు ఎందుకు రాద్ధాంతం చేస్తున్నాయో అర్థం కావడం లేదు. వారు ఆరోపణలు చేసే ముందు ఆలోచించుకోవాలి. అంతిమంగా దేశప్రతిష్ఠ దెబ్బతినకుండా వ్యవహరించాలి. నిరసన తెలిపే హక్కు ఉంది.. కానీ హింసాయుతంగా చేయడం మంచిది కాదు" అని వెంకయ్య నాయుడు అన్నారు.

## బాబు పవన్ విజయ్ ఒకే ఫ్రేమ్... ఏపీకి తమిళ సీఎం !

రాష్ట్రాలకు నీటి కొరత తీరుతుందని కూడా బాబు చెబుతున్నారు. దీని మీద కూడా విజయ్ ఏపీ సీఎం చంద్రబాబుతో చర్చిస్తారు అని అంటున్నారు. ఏపీ తమిళనాడు ముఖ్యమంత్రుల మధ్య ఉన్నత స్థాయి సమావేశం జరుగుతుందని ఈ సందర్భంగా అనేక అంతర రాష్ట్ర సమస్యలకు పరిష్కారం లభిస్తుంది అని భావిస్తున్నారు. అంతే కాదు రెండు రాష్ట్రాల మధ్య సానుకూల వైఖరితో పాటు మంచి సంబంధాలు నెలకొనేందుకు ఆస్కారం ఉంటుందని అంటున్నారు.

**పవన్ తో తొలిసారి :**ఇదిలా ఉంటే ఏపీకి వస్తున్న విజయ్ ఉప ముఖ్యమంత్రి పవన్ తో తొలి భేటీ వేస్తారు అని అంటున్నారు. చంద్రబాబు ఈ మధ్య దక్షిణాది రాష్ట్రాల సమావేశం చెన్నైలో జరిగినపుడు వెళ్ళారు. అక్కడ అలా విజయ్ ని ఆయన కలుసుకున్నారు. పవన్ తో విజయ్ భేటీ అయితే జరగలేదు. దాంతో ఈసారి ఈ ఇద్దరూ కలసి ఒకే ఫ్రేమ్ లో కనిపిస్తారు అని అంటున్నారు. ఈ ఇద్దరికీ ఒక పోలిక ఉంది. సినీ రంగం నుంచి రాజకీయాల్లోకి వచ్చి ఒకరు ముఖ్యమంత్రిగా మరొకరు ఉప ముఖ్యమంత్రిగా పనిచేస్తున్నారు. దాంతో ఈ నెల 13న విజయ్ జరిపే అధికారిక పర్యటన మీద అందరి కళ్లూ ఉన్నాయి.

## పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన మార్కాపురం జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా

### ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలి
### పోలీసు అధికారులకు ఎస్పీ ఆదేశాలు



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, అక్టోబర్ 10)

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్టమైన ముందస్తు చర్యలు చేపట్టాలని మార్కాపురం జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం ఎస్పీ సిఎస్‌పురం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, స్టేషన్ పరిసరాలు, రికార్డులు, పెండింగ్ కేసులు, ఎన్నికలకు సంబంధించిన రికార్డులు, పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై పలు కీలక సూచనలు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని ముందుగానే పరిశీలించి, భవన పరిస్థితి, ప్రవేశం, నిష్క్రమణ మార్గాలు, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, వాహనాల పార్కింగ్ తదితర సౌకర్యాలు, భద్రతాపరమైన అంశాలపై పూర్తి వివరాలు సిద్ధం చేసుకోవాలన్నారు. గత ఎన్నికల్లో ఘర్షణలు, వివాదాలు, కేసులు నమోదైన గ్రామాలు, పోలింగ్ కేంద్రాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులు, ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తుల కదలికలను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అవసరమైన వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించి, చట్టప్రకారం పిఐఆర్ నమోదు, సంబంధిత రెవెన్యూ అధికారుల సమక్షంలో బైండోవర్ చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్ల ముద్దాయిల ఆచూకీ గుర్తించి, వారెంట్ల అమలుకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. పెండింగ్ కేసులను సమీక్షిస్తూ, దర్యాప్తును వేగవంతం చేసి, చట్టపరమైన ప్రక్రియలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ కానిస్టేబుళ్ల సహకారంతో గ్రామాల్లోని పాత వివాదాలు, భూవివాదాలు, రాజకీయ విభేదాలు, సున్నితమైన ప్రాంతాలు, ముఖ్యమైన వ్యక్తులకు సంబంధించిన శాంతిభద్రతల సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించాలన్నారు. సమస్యలు తలెత్తిన తర్వాత స్పందించడం కాకుండా, ముందస్తు సమాచారంతో వాటిని గుర్తించి, చట్టప్రకారం నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ, పరిస్థితులకు అనుగుణంగా తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నియమావళి, చట్టాలను పాటిస్తూ, ప్రజలందరికీ సమాన భద్రత కల్పించి, ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో విధులు నిర్వహించాలని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ తనిఖీ సందర్భంగా పామూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి వినోద్ కుమార్, సిఎస్‌పురం పోలీస్ స్టేషన్ ఎస్ఐ పి వెంకటేశ్వరరెడ్డి, ఎన్నికల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, ముందస్తు చర్యలకు సంబంధించి జిల్లా ఎస్పీ పలు సూచనలు చేశారు.

## గిన్నిస్ రికార్డుకు డప్పు దరువు

### తిరుపతికి మార్కాపురం నుంచి 150 మంది కళాకారులు
### ప్రధాని మోడీ జన్మదిన సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా ప్రదర్శన
### జెండా ఊపి ప్రారంభించిన బిజెపి జిల్లా అధ్యక్షులు పీవీ కృష్ణారావు







(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, అక్టోబర్ 10)

ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకొని సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా తిరుపతిలో బిజెపి ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో చేపట్టిన 72 గంటల పాటు 2000 మంది డప్పు కళాకారుల నిర్విరామ ప్రదర్శన కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా జరగనుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు మార్కాపురం జిల్లా బిజెపి ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో 150 మంది డప్పు కళాకారులు శనివారం తిరుపతికి బయలుదేరి వెళ్లారు. మార్కాపురంలోని ఎస్వీకేపీ కళాశాల వద్ద వారి వాహనాలను మార్కాపురం జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు పీవీ కృష్ణారావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పీవీ కృష్ణారావు మాట్లాడుతూ ప్రధాని మోడీ జన్మదిన వేడుకల్లో భాగంగా జరుగుతున్న ఈ డప్పు కళాకారుల ప్రదర్శన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లోకి ఎక్కడం ఖాయమని అన్నారు. ఇది మన ఆంధ్ర డప్పు కళాకారుల కృషికి, కళకు దక్కిన గౌరవమని పేర్కొన్నారు. మార్కాపురం జిల్లా నుంచి 150 మంది కళాకారులు వెళ్లడం గర్వకారణమని, వారికి బిజెపి తరపున అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ప్రధాని మోడీ నాయకత్వంలో దళిత కళాకారులకు, సంస్కృతికి ఇస్తున్న ప్రాధాన్యతకు ఇది నిదర్శనమని ఆయన హైలెట్ చేశారు.ఈ కార్యక్రమంలో మార్కాపురం జిల్లా ఎస్సీ మోర్చా ఇన్‌చార్జి దారి వేముల శ్రీనివాస్, బిజెపి నాయకులు డాక్టర్ కిరణ్, దేవిశెట్టి చంద్రశేఖర్, శాతరాజుపల్లి ప్రవీణ్, తదితర ఎస్సీ మోర్చా నాయకులు, కళాకారులు పాల్గొన్నారు.

## ఇండోర్ స్టేడియంలో ఆహార భద్రత పై అవగాహన కార్యక్రమం

### ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ శివతేజ






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 10)

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ డైరెక్టర్ ఆదేశాల మేరకు శనివారం ఒంగోలు ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఆహార భద్రతపై ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ శివతేజ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ఆహార భద్రతకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేసి, సురక్షితమైన, పరిశుభ్రమైన ఆహారపు అలవాట్ల ప్రాముఖ్యతను వివరించారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోవడంతో పాటు, ఆహార పదార్థాల నాణ్యతపై కూడా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అదే విధంగా కార్యక్రమానికి హాజరైన తల్లిదండ్రులకు సురక్షితమైన ఆహారం, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఆహార భద్రతా నియమాలను పాటిస్తూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని అవగాహన కల్పించారు.








ప్రకాశం | మార్కాపురం | బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
11.10.26 ఆదివారం


# శివాలయం అభివృద్ధా...అదెక్కడ?



- ఏడాదిన్నరగా చేసింది శూన్యం
- పూజలు తప్ప అభివృద్ధి కనుమరుగు
- పదవిలోకి వచ్చేటప్పుడు మూడు గోపురాలు కడతామన్న వైనం
- ఏడాదిన్నర దాటినా గాలి గోపురాలు గాలిలోనే
- బందపరుపు మార్చిన దాఖలాలు లేవు
- చైర్మన్ ఒగ్గు వెంకట్రామయ్య ఆధ్వర్యంలో ఘనంగా తెప్పోత్సవం
- రెండు సారి తెప్పోత్సవానికి కరువైన జనం
- ఆర్యవైశ్యులు చైర్మన్ అయితే అభివృద్ధి జరుగుతుందని భావించిన ఎమ్మెల్యే కందుల
- అయినా అభివృద్ధి శూన్యం
- మాజీ శివాలయం చైర్మన్ సామంతపూడి హయాంలో ఒక గాలి గోపురం నిర్మాణం
- నవరాత్రుల సమాచారం మీడియాకు కూడా కరువే





(షణ్ముఖ వెలుగు, పొదిలి, అక్టోబర్ 10)

పొదిలి శివాలయం అభివృద్ధి జరగాలంటే ఆర్యవైశ్యులకు ఆ పదవి ఇవ్వాలని భావించిన మార్కాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆచితూచి అడుగులు వేసి మరీ ఆర్యవైశ్యుడైన ఒగ్గు వెంకట్రామయ్య ఆ నాటి పరిస్థితులు అనుకూలంగా లేకున్నా అతని పై ఎంతో నమ్మకంతో ఆ పదవిని కట్టబెట్టారు. అయితే ఆ పదవి తీసుకునే సమయంలో తనకు పదవి ఇస్తే శివాలయంలో మూడు గాలిగోపురాలను నిర్మించేందుకు దాతలను తీసుకు వచ్చి వారం, పది రోజుల్లో వాటికి భూమి పూజ చేస్తానని ఎమ్మెల్యేకు వివరించారు. అయితే ఏడాదిన్నర క్రితం చెప్పిన ఆ మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి. గాలిగోపురాలం విషయం చైర్మన్ గాలికి వదిలేశారు. అయితే చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత గతంలో పని చేసిన ఏ చైర్మన్ పనిని ఆయన కమిటీ సభ్యుల నియామకం జరగకపోయినా ఒంటి చేత్తో 60, 70 సంవత్సరాలుగా పొదిలి ప్రాంత భక్తులు ఎన్నడూ చూడని తెప్పోత్సవానికి శ్రీకారం చుట్టారు. సమయం తక్కువగా ఉన్నప్పటికీ ఒంటరివాడు అయినా కూడా అన్ని బాధ్యతలు తన నెత్తిన వేసుకుని మరీ తెప్పోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అయితే రెండో సారి నిర్వహించిన తెప్పోత్సవానికి మాత్రం జనంకరువయ్యారు. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి శివాలయంలో జరిగే కార్యక్రమాలకు కనీసం మీడియాకు కూడా సమాచారం కరువనే చెప్పాలి. మీడియా ప్రతినిధులు అడిగితే తప్ప అటు చైర్మన్, ఇటు ఆలయ ఈఓ సమాచారం చెప్పని పరిస్థితి. శివాలయం ఆర్యవైశ్యుల పాలనలో ఎంతో అభివృద్ధి జరుగుతుందని భక్తులందరూ భావించారు. కానీ ఆర్యవైశ్యులు చైర్మన్‌గా ఉన్నా అభివృద్ధి మాత్రం అడుగు కూడా ముందుకుపడదని భక్తులకు ఇప్పుడిప్పుడే తెలుస్తుంది. ఆలయ అధికారులు కూడా ఆలయ అభివృద్ధి కోసం చర్యలు తీసుకున్న దాఖలాలు కూడా లేవనే చెప్పవచ్చు. షాపుల వేలం పాటల ద్వారా నగదు ఆలయానికి చేకూర్చే విషయంలో కూడా లోపభూయిష్టంగా వ్యవహరించారు. ఒక్కో షాపుకు నెలకు రూ.15 వేలకు పైగా అద్దె వచ్చే అవకాశం ఉన్నా కూడా నెలకు కేవలం రూ.2000 కు అప్పగించారు. ఇక అభివృద్ధి ఏ రూపంలో చేస్తారో అధికారులకే తెలియాలి. ఇక ఆలయ కమిటీ ఏర్పడిన నాటి నుండి ముగ్గురు, నలుగురు తప్ప ఇతర కమిటీ సభ్యులు పొదిలి పట్టణంలో ఎంతో వైభవంగా జరిగే రథోత్సవం రోజున కూడా హాజరు కాలేదంటే కమిటీ చైర్మన్‌కు, కమిటీ సభ్యులకు ఉన్న అనుబంధం ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చు. చైర్మన్ కూడా శివాలయంలో జరిగే కార్యక్రమ వివరాలను మీడియాకు తెలిపిన సందర్భాలు కూడా లేవనే చెప్పవచ్చు. ఫోన్‌లు చేసి అడిగిన వారికి చెప్పడం తప్ప సమాచారం ఇవ్వడంలో పూర్తి అలసత్వం ఉంది. కేవలం ప్రతి చిన్న, పెద్ద పండుగలకు పూజలు నిర్వహిస్తున్నారే తప్ప ఆలయాన్ని అభివృద్ధి చేయాలన్న మనస్సు మాత్రం ఆయనకు రావడం లేదు. నేటి నుంచి ప్రారంభమయ్యే దసరా నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి కూడా కనీస సమాచారం మీడియా ప్రతినిధులకు లేదంటే అటు ఆలయ కమిటీ, ఇటు ఆలయ ఈఓ ఏ విధంగా వ్యవహరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఏడాదిన్నర తర్వాత కొద్ది రోజుల క్రితం మార్కాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ని ఆలయ చైర్మన్ కలిసిన సందర్భంలో త్వరలో గాలి గోపురాల నిర్మాణానికి దాతలు ముందుకు వస్తారని చెప్పడంలో ఆయన పదవిని మరో రెండేళ్ళు పెంచుకునేందుకేనని ప్రచారం పట్టణంలో జోరుగా సాగుతోంది. ఏడాదిన్నరగా రాని దాతలు ఆయన పదవి కాలం ముగిసే సమయంలో వచ్చారంటే ఆయనకు ఆలయం అభివృద్ధి పై ఏ మేర శ్రద్ధ ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా ఎమ్మెల్యే ఆర్యవైశ్యుల పై పెట్టుకున్న నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా వీలైనంత త్వరగా ఆలయ గాలిగోపురాలకు భూమి పూజ చేయడంతో ఆలయ అభివృద్ధికి నడుంబిగించాలని పొదిలి పట్టణ ప్రజలు, భక్తులు కోరుతున్నారు. మరి ఆ దిశగా ఆలయ కమిటీ చైర్మన్ అడుగులు వేస్తారో లేదో వేచి చూడాల్సిందే...!



## పాకల బీచ్ లో విషాదం

- సముద్ర స్నానానికి వెళ్ళి ఇద్దరు మృతి
- అలల ఉధృతికి ఇంకో ఇద్దరు గల్లంతు
- ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరో ముగ్గురు
- ఘటన స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, అక్టోబర్ 10)

సింగరాయకొండ మండలం పాకల బీచ్ లో శనివారం విషాదం చోటుచేసుకుంది. సముద్ర స్నానానికి వచ్చిన వారిలో ఇద్దరు యువకులు అలల ఉధృతికి మృతి చెందారు. మరో ఇద్దరు గల్లంతయ్యారు. ఈ ప్రమాదంలో మరో ముగ్గురుని స్థానిక మత్స్యకారులు, పోలీసులు కాపాడారు. జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ఘటన స్థలాన్ని సందర్శించి బాధిత కుటుంబ సభ్యుల ద్వారా వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రమాద తీరు, మృతుల వివరాలను వివరించారు. కనిగిరి మండలం శ్రీరంగపురం గ్రామం నుండి సుమారు 70 మంది తమ ఆచారం ప్రకారం పోలేరమ్మ జాతర జరుపుకొని, సముద్ర స్నానం చేయడానికి పాకల బీచ్‌కు వచ్చారు. అక్కడ స్నానం చేస్తుండగా ఒక పెద్ద అల వచ్చి కొందరిని లోపలికి లాక్కెళ్ళిందని ఆ బృంద సభ్యులు చెప్పినట్లు తెలిపారు. పరిస్థితిని గమనించిన స్థానిక మత్స్యకారులు, పోలీసు టవర్ వద్ద ఉన్న పోలీసులు వెంటనే స్పందించి బోట్ల ద్వారా కొంతమందిని రక్షించారన్నారు. ఈ దుర్ఘటనలో పాలడుగు తేజ (20), బత్తుల మహేష్ బాబు (22) మృతి చెందగా దేవల విష్ణు, దేవల నారాయణ గల్లంతయ్యారు. చికిత్స పొందుతున్న వారిలో మనోజ్ కుమార్, మహేష్ తేజ, నరసింహ ఉన్నారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రస్తుతం జిజిహెచ్ (ఒంగోలు), కందుకూరు కోటారెడ్డి ఆసుపత్రి, ఒంగోలు రమేష్ ఆసుపత్రులలో ▶4లో

## 2029 ఎన్నికలే లక్ష్యంగా అభ్యర్థుల ఎంపిక

అమ్ముడుపోయే అభ్యర్థులను దూరం పెట్టే ప్రయత్నంలో వైసీపీ

గెలుపు గుర్రాలే మా లక్ష్యమంటున్న కూటమి పార్టీలు



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, అక్టోబర్ 10)

ఎన్నికల నోటిఫికేషన్ రెండు రోజుల్లో రానుంది. దీంతో ప్రధాన పార్టీలు అభ్యర్థుల ఎంపిక పై దృష్టి పెట్టాయి. ఎన్నికల గజిట్ నోటిఫికేషన్, రిజర్వేషన్ల ప్రకటన జరగనున్న తరుణంలో అభ్యర్థుల ఎంపిక పై ఇరు పార్టీలు వ్యూహ, ప్రతి వ్యూహాలకు పదును పెట్టాయి. రాష్ట్రం యూనిట్‌గా మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి రిజర్వేషన్ ప్రక్రియ జరగనుండడంతో కనిగిరి మున్సిపాల్టీ జనరల్‌కు కేటాయించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. రెండు పర్యాయాలు కనిగిరి మన్సిపాల్టీ బిసిలకు కేటాయించారు. బిసిలకు 34 శాతం రిజర్వేషన్ ఇవ్వకుండా కూటమి పార్టీలు 34 శాతం మంది అభ్యర్థులను బరిలోకి దింపుదామని ఇప్పటికే ప్రకటన విడుదల చేసింది. ఈ పరిస్థితుల్లో కనిగిరి ఓసి జనరల్ కు కేటాయించినా బిసి అభ్యర్థిని నిలిపే అవకాశాలు లేకపోలేదనే చర్చ జరుగుతోంది. అయితే మున్సిపల్ చైర్మన్ ఎన్నిక ప్రత్యక్ష పద్ధతిలో కావడంతో అభ్యర్థి ఎంపిక విషయంలో ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి ఆచి తూచి అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. కనిగిరి మున్సిపాల్టీలోని 32 వార్డుల్లో రిజర్వేషన్ల వారీ అభ్యర్థుల జాబితా ఎమ్మెల్యే వద్ద ఉన్నట్లు సమాచారం. 12 వార్డులు బిసిలకు రిజర్వుడు అయ్యే తరుణంలో చైర్మన్ పదవి జనరల్‌కు కేటాయిస్తే ▶4లో

## అద్దంకి గడ్డపై "మేయర్" టిడిపి జెండా ఎగరనుందా?



(షణ్ముఖ వెలుగు, అద్దంకి, అక్టోబర్ 10)

స్థానిక సంస్థల ఎన్నికలకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం సమాయత్తం అవుతున్న సంగతి తెలిసిందే. అయితే మొదట మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అద్దంకి గడ్డపై మేయర్ టిడిపి కైవసం చేసుకుంటుందనే చర్చ రాజకీయ వర్గాలలో మొదలైంది. ఇందుకు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చాప కింద నీరులా వ్యూహరచన చేసినట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగానే మంత్రి తరచు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించడం, దేవాదాయ భూముల జాబితాలో నుండి లబ్ధిదారులకు విముక్తి కలిగించటం వంటివి ఎన్నికలవేళ తెరవెనక జరిగినవేనని వారు అంటున్నారు. రవికుమార్ త్రిశూల వ్యూహాలతో ముందుకు పోతున్నాడని రాజకీయ విశ్లేషకులు అంచనా

## తౌషీక్-మౌలాబీ మరణాలతో తనకు సంబంధంలేదు

### ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, అక్టోబర్ 10)

శింగరాయకొండ గ్రామంలోని శ్రీ చైతన్య నవోదయ విద్యా సంస్థలో చదువుతున్న విద్యార్థి తౌషీక్ ఇటీవల మృతిచెందడం జరిగింది. ఆ విద్యార్థి మరణాన్ని ఆత్మహత్యగా చిత్రీకరించడంలో తన పాత్ర వుందని యంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ మీడియా సమావేశాలలో చేస్తున్న ఆరోపణలలో ఎలాంటి వాస్తవం లేదన్నారు. శనివారం తన కార్యాలయంలో నిర్వహించిన మీడియా ▶4లో



▶4లో

## శ్రీవారి బ్రహ్మోత్సవాలకు మార్టూరు నుంచి 14 టన్నుల కూరగాయలు

# తౌషిక్-మౌలాబీ మరణాలతో తనకు సంబంధంలేదు

సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీ చైతన్య, నవోదయ విద్యాసంస్థలతో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఆ యాజమాన్యాన్ని కాపాడాల్సిన అవసరం అంతకంటే తనకు లేదన్నారు. విద్యార్థి మృతి కేసును తారుమారు చేయుటకు తాను ఎవరకీ సిఫార్సు చేయలేదన్నారు. మా మాగుంట కుటుంబం గురించి ప్రకాశం జిల్లా ప్రజలందరికి తెలుసన్నారు. మా అన్న స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి ఆశయాలను కొనసాగించేందుకే మా మాగుంట కుటుంబం రాజకీయాల్లో ఉందన్నారు. ప్రజలకు సేవ చేయటమే మా మాగుంట కుటంబ లక్ష్యమన్నారు. ప్రజల ఆదరణ-ఆశీస్సులతోనే మా కుటుంబం మూడు దశాబ్దాలకు పైగా జిల్లాలో రాజకీయం చేస్తుందన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు మాత్రమే మాగుంట కుటుంబం ఉందని మీడియా ముఖంగా తెలియజేస్తున్నానన్నారు. అసత్య ఆరోపణలు చేసే ముందు మా కుటుంబ నేపధ్యం తెలుసుకొని మాట్లాడాలన్నారు. తౌషిక్ మరణం పై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి వాస్తవాలను నిగ్గుతేల్చాలని మాగుంట కుటుంబం కూడా కోరుతుందన్నారు.

# అద్దంకి గడ్డపై “మేయర్” టిడిపి జెండా ఎగరనుందా?

వేస్తున్నారు. మరొకవైపు పట్టణంలో వైసీపీకి బలమైన నాయకుడు లేకపోవడం, ఆ పార్టీకి మైనస్‌గా మారిందని పలువురు రాజకీయ విశ్లేషకులు లెక్కలు వేస్తున్నారు. అయితే ఇది ఇలా ఉండగా వైసిపి ఇంచార్జ్ డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ కూడా క్యాడర్‌ను పటిష్టం చేయకపోవడం, కార్యకర్తలకు అండగా నిలబడలేదని ఆ పార్టీ నేతల్లోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. వరుస విజయాలతో దూసుకుపోతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్ రాజకీయ చతురత ముందు డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ రాజకీయం నెగ్గ గలదా అనే ప్రశ్నలు అటు ప్రజలు, ఇటు వైసీపీ పార్టీ నేతల నుండి వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అద్దంకిలో వైసిపి మేయర్‌ను గద్దె దింపే అవకాశం ఉన్న మంత్రి రవికుమార్ ఆ ఆలోచన చేయలేదని, అభివృద్ధి లక్ష్యంగా పనిచేశారని ప్రజల్లో సానుకూలత వ్యక్తం అవుతుంది. మరి అద్దంకిలో మేయర్‌ను టిడిపి కైవసం చేసుకుంటుందా, వైసిపి పోటీ ఇస్తుందా లేదా అనే క్లైమాక్స్‌కు వేచి చూడాల్సిందే...!

# 2029 ఎన్నికలే లక్ష్యంగా అభ్యర్థుల ఎంపిక

బిసి అభ్యర్థిని ఛైర్మన్ అభ్యర్థిగా నిలబెడితే పరిస్థితి ఏమిటని అంతర్మథనంలో ఉన్నట్లు సమాచారం. 2029 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా 32 వార్డుల్లో ఆర్థిక బలం ఉన్న వారితో పాటు సామాజికవర్గాల వారీగా పేరు ప్రతిష్టలు ఉన్నవారిని అభ్యర్థులుగా ఎంపిక చేయాలని ఎమ్మెల్యే ఉగ్ర తలస్తున్నట్లు సమాచారం.

**అమ్ముడుపోయే అభ్యర్థుల పట్ల వైసీపీ ప్రత్యేక దృష్టి**

కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర కనిగిరి పట్టణంలో అభివృద్ధి పనులు పరుగెత్తిస్తున్నారు. పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేశారు. ఈ పరిస్థితుల్లో అధికార కూటమి ప్రభుత్వం అభ్యర్థులను ఎదుర్కోవాలంటే వైసీపీ అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి అడుగులు వేయాలన్న ఆలోచనలో ఉంది. గత మున్సిపల్ ఎన్నికల్లో టిడిపి తరుపున పోటీ చేసిన పలువురు అభ్యర్థులు డబ్బులకు కక్కుర్తిపడి నామినేషన్ విత్‌డ్రా చేసుకున్న పరిస్థితులున్నాయి. మరికొందరు అప్పటి టిడిపి అభ్యర్థులు బెదిరింపులకు, ప్రలోభాలకు లొంగి అప్పటి టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డికి తెలియకుండానే నామినేషన్ లను విత్‌డ్రా చేసుకున్న పరిస్థితులు లేకపోలేదు. అప్పటి ఓ మున్సిపల్ కౌన్సిలర్ భర్త ప్రతిపక్ష నేతగా ఉన్న డాక్టర్ ఉగ్రతో మున్సిపల్ కార్యాలయంలోనే గొడవకు దిగిన పరిస్థితులున్నాయి. రేపు జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ పద్ధతులనే కూటమి పార్టీల నాయకులు అవలంబించడం ఖాయమనే చర్చ జరుగుతుంది. ఈ పరిస్థితుల్లో కరుడుగట్టిన వైసీపీ నాయకులనే అభ్యర్థులుగా నిలపాలని ఆ పార్టీ ఇన్‌ఛార్జి దద్దాల నారయణ యాదవ్ ఆలోచిస్తున్నట్లు తెలుస్తుంది. వైసీపీ అభ్యర్థులకు ఎన్నికల ఖర్చు మోసే నాయకుడు ఎవడనే చర్చ కూడా బలంగా వినిపిస్తుంది. ఆర్థికంగా బలమైనఛైర్మన్ అభ్యర్థిని నిలిపి కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆ పార్టీ యోచిస్తుంది. 2014 మున్సిపల్ ఎన్నికల్లో కనిగిరి మున్సిపల్ పరిధిలోని 20వ వార్డులో మాకినేని రాధిక, సాయిరాం ఇండిపెండెంట్‌గా గెలిచి టిడిపి, కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించింది. అలాంటి వ్యక్తిగత ఇమేజ్ ఉన్న అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఇరు పార్టీలు అభ్యర్థుల ఎంపికలో తలమునకలైపోతున్నాయి. ఓసి జనరల్ అయితే కూటమి తరుపున ఆర్యవైశ్యులు ఛైర్మన్ అభ్యర్థి ఖాయమనే చర్చ జరుగుతుంది. సిండికేట్ వ్యాపారి జి పవన్ కుమార్, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ సుగుణమ్మ కుటుంబ సభ్యుల్లో ఒకరు లేక కనిగిరి పిఏసిఎస్ ఛైర్మన్ అద్దంకి రంగబాబులు ఛైర్మన్ అభ్యర్థి కావడం ఖాయం అనే ప్రచారం జోరుగా సాగుతోంది. వైసీపీ మాత్రం మాజీ మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ పులి శాంతి పేరు దాదాపు ఖరారు అయ్యే అవకాశాలున్నాయి. ఇదిలా ఉంటే టిడిపి మద్ధతుతో 12వ వార్డు నుండి సిపిఐ అభ్యర్థిగా యాసీన్ బరిలో నిలవనున్నారు. బిసివై పార్టీ కూడా మున్సిపాల్టీ ఎన్నికల్లో కనిగిరి నుండి పోటీ చేయడం ఖాయమనే చర్చ సాగుతోంది.

# శ్రీవారి బ్రహ్మోత్సవాలకు మార్టూరు నుంచి 14 టన్నుల కూరగాయలు

(షణ్ముఖ వెలుగు, మార్టూరు, అక్టోబర్ 10)

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు అన్నప్రసాదాల తయారీ కోసం బాపట్ల జిల్లా మార్టూరు నుంచి 14 టన్నుల కూరగాయలను తిరుమలకు పంపించారు. స్థానిక శ్రీ వెంకటేశ్వర భక్త సమాజం ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత మార్టూరులోని విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కూరగాయలను లారీలో తిరుమలకు తరలించారు. గత ఐదేళ్లుగా శ్రీవారి బ్రహ్మోత్సవాల సమయంలో సుమారు లక్ష మంది భక్తులకు భోజనాలు సిద్ధం చేసేందుకు అవసరమైన కూరగాయలను పంపిస్తున్నట్లు భక్త సమాజం సభ్యులు తెలిపారు.
శ్రీవారి సేవలో భాగస్వాములు కావడం ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు.

# ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి




(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, అక్టోబర్ 10)

ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కరేడు, రామకృష్ణాపురంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ఓట్లు చోరీ చేసిన కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ శనివారం ఉలవపాడు మండలంలోని కరేడు రామకృష్ణాపురంలో సిఐటియు, వ్యవసాయకార్మిక సంఘం, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘాల దేశవ్యాప్త పిలుపు మేరకు నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఐటీయూ జిల్లా నాయకులు జీవీబీ కుమార్ మాట్లాడుతూ ఓట్లను పెద్ద సంఖ్యలో ఏకపక్షంగా తొలగించిన, చోరీ చేసిన కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ బాధ్యత వహిస్తూ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. చలో ఢిల్లీ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి రైళ్లను రద్దు చేయడం, ఢిల్లీకి వెళ్లే నాయకులను నిర్బంధించడం, అరెస్టు చేయటం శోచనీయమన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం ఉలవపాడు మండల నాయకులు మాణికల రమణమ్మ, ధనలక్ష్మమ్మ, సీఐటీయూ మండల నాయకులు శ్రీను, చెవూరి వసంత, ఐద్వా ఉలవపాడు మండల అధ్యక్షురాలు మల్లవరపు లలితమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా, సిఐటియు కత్తి వసంత, కత్తి వెంకటేశ్వర్లు, వెంకాయమ్మ, కే కోటయ్య, మల్లవరపు సుబ్బయ్య, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# పాకల బీచ్ లో విషాదం





క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందుతోందన్నారు. పోలీసు యంత్రాంగం, మత్స్యకారులు గల్లంతయిన వారి ఆచూకీ కోసం డ్రోన్లు, పడవల సహాయంతో గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు ఆయన చెప్పారు. బాధిత కుటుంబాలకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని విధాల అండగా ఉంటుందన్నారు. బీచ్‌కు వచ్చేవారు జాగ్రత్తగా ఉండాలని, భద్రతాపరంగా పోలీసు సిబ్బంది చేసే సూచనలను పాటించాలని కలెక్టర్ కోరారు. అనంతరం కందుకూరు కోటారెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నరసింహను పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందని, ఎలాంటి ప్రమాదము లేదని వైద్యులు తెలిపారు. ఈ సమయంలో కలెక్టర్ వెంట కందుకూరు సబ్ కలెక్టర్ డి హిమవంశి, కందుకూరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉన్నారు.



# ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఉమా మనోవికాస్ కేంద్రంలో న్యాయ విజ్ఞాన సదస్సు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 10)

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రకాశం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఒంగోలు పట్టణంలోని ఉమా మనోవికాస్ కేంద్రంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మధ్యవర్తిత్వ న్యాయవాది షేక్ సంధాని పాల్గొని, కేంద్రంలోని మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని ఉద్దేశించి ప్రసంగించారు. మానసిక ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, మానసిక సమస్యలతో బాధపడుతున్న వారిని ప్రేమతో, ఆప్యాయతతో ఆదరించాలని, వారికి సమాజంలో గౌరవప్రదమైన జీవనం కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అలాగే, మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి అందుబాటులో ఉన్న హక్కులు, ఉచిత న్యాయ సహాయం మరియు న్యాయ సేవల గురించి అవగాహన కలిగి ఉండాలని వివరించారు. ప్రతి ఒక్కరికీ న్యాయం అందించడమే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమా మనోవికాస్ కేంద్రం నిర్వాహకులు శ్రీ ఈశ్వర్, సంస్థ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రకృతి సేద్యంలో ఏపీ నంబర్ 1, 25 లక్షల మంది రైతులు లక్ష్యం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,అక్టోబర్ 10)



ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతం చేయడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానానికి చేరిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రాష్ట్రంలో 25 లక్షల మంది రైతులను ప్రకృతి సేద్యం వైపు ప్రోత్సహించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రకృతి సేద్యం, ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన (పీఎండీఎస్)పై ఆయన శనివారం టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి అచ్చెన్నాయుడు, రైతులు, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. 2016లో కేవలం 40 వేల మంది రైతులతో ప్రారంభమైన ఈ ప్రస్థానం నేడు 17.73 లక్షల మందికి చేరిందన్నారు. కొందరు గతంలో ఇది విజయవంతం కాదని దుష్ప్రచారం చేసినా, రైతులు అద్భుతమైన ఫలితాలు సాధించారని కొనియాడారు. రసాయన ఎరువులతో భూసారం క్షీణించి, సాగు ఖర్చులు పెరిగి రైతులకు భారం అవుతోందన్నారు. కానీ ప్రకృతి సేద్యం ద్వారా పెట్టుబడి వ్యయం తగ్గి ఆదాయం గణనీయంగా పెరుగుతోందని వివరించారు. “రసాయన ఎరువులతో పోలిస్తే ప్రకృతి వ్యవసాయంలో రైతులకు సగటున 47 శాతం మేర ఆదాయం పెరిగింది. పత్తి పంటలో 96 శాతం, కందుల్లో 87 శాతం నికర ఆదాయం లభించింది. తీవ్రమైన కరవు పరిస్థితులను సైతం తట్టుకుని ఈ విధానంలో మంచి దిగుబడులు వస్తున్నాయి,” అని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలో ప్రకృతి సాగు విధానాలను అధ్యయనం చేసేందుకు ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి ప్రతినిధులు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రకృతి సేద్యంలో గుజరాత్ కంటే ఏపీ ముందంజలో ఉందని ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ప్రశంసించారని గుర్తుచేశారు. గత ఏడాదితో పోలిస్తే రాష్ట్రంలో రసాయన ఎరువుల వినియోగం 2.28 శాతం తగ్గిందని, దీనికి గాను కేంద్రం నుంచి రావాల్సిన రూ.218 కోట్ల ప్రోత్సాహకాల కోసం ఇప్పటికే లేఖ రాశామని చంద్రబాబు వెల్లడించారు. ఎల్ నినో ప్రభావాన్ని తగ్గించేందుకు అనంతపురం జిల్లాలో 10 లక్షల పంట కుంటలు, చెక్ డ్యామ్‌లు తవ్వించామని, నదుల అనుసంధానంతో వర్షాభావ పరిస్థితులను కూడా అధిగమించవచ్చని అన్నారు. కషాయం, జీవామృతం తయారీకి అవసరమైన దేశీయ ఆవుల కోసం మరిన్ని గోకులాలను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ప్రకృతి సేద్యాన్ని ముందుకు తీసుకెళ్తున్న రైతులే తనకు అసలైన స్ఫూర్తి అని, వారి కృషి అభినందనీయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## వేంపల్లె అమ్మవారిశాలలో నేటి నుండి దసరా ఉత్సవాలు



(షణ్ముఖ వెలుగు, వేంపల్లె, అక్టోబర్ 10)
వేంపల్లె పట్టణంలో 122 సంవత్సరాలు చరిత్ర గల శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో 11వ తేదీ ఆదివారం నుండి దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్, పాలకవర్గం సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.
ఈ సందర్భంగా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు నేటి నుండి అనగా 11వ తేది నుంచి 21వ తేది వరకు 10 రోజుల పాటు అంగరంగ వైభవంగా జరుగుతాయన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ సిద్ధాంతి నేతృత్వంలో ప్రతిరోజూ ఆలయంలో ఉదయం శ్రీ వాసవి మాత మూలవిరాట్ అమ్మవారికి తోమాల అలంకరణ,ఉత్సవమూర్తి అమ్మవారికి పంచామృతాభిషేకం, నివేదన, మంత్రపుష్పం, మహామంగళ హారతి, తదితర విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం వాసవి మాత ఉత్సవమూర్తిని వివిధ అవతారల్లో అలంకరించి సాయంత్రం 7 గంటల నుంచి భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నారు. 11వ తేది సాయంత్రం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి, రాత్రి శ్రీ రాజరాజేశ్వరి దేవి, 12వ తేది శ్రీ గజలక్ష్మి దేవి, 13వ తేది సాయంత్రం అంభాభవాని దేవి,రాత్రి శ్రీ అన్నపూర్ణ దేవి, 14వ తేది శ్రీ జయలక్ష్మి దేవి, 15వ తేది సాయంత్రం శ్రీ వనవిహారిణి దేవి, రాత్రి శ్రీ మోహినీ దేవి, 16వ తేది ఉదయం బిందెసేవ, రాత్రి శ్రీ సరస్వతి దేవి,17వ తేది సాయంత్రం మీనాక్షి దేవి, రాత్రి శ్రీ పార్వతీ దేవి, 18వ తేది దుర్గాష్టమికి రాత్రి శ్రీ మహిషాసురమర్ధిని దేవి, 19వ తేది ఉదయం చండీహోమం, పూర్ణాహుతి, రాత్రి భువనేశ్వరి దేవి, 20వ తేది సాయంత్రం శమీవృక్ష దర్శనం, రాత్రి 9 గంటలకు అత్యంత వైభవోపేతంగా శ్రీ విజయలక్ష్మి దేవి గ్రామోత్సవం, 21వ తేది ఉదయం వసంతోత్సవం, రాత్రి పాన్పుసేవ అలంకారాలతో భక్తులకు వాసవి మాత దర్శనమివ్వనున్నారు. భక్తులకు దర్శనార్థం క్యూ లైన్లు, తీర్థ ప్రసాదాలకు ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవాల్లో 10రోజులు అర్చకులు శాకల్య నరసయ్య నేతృత్వంలో జపహోమాలు నిర్వహించనున్నారు. ప్రతి రోజు శ్రీ వాసవి కళ్యాణ మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు, తదితర వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలకు భారీ స్వాగత ముఖద్వారాలు, పందిర్లు, ఆలయంలో విద్యుత్ దీపాలంకరణ, పట్టణంలోని ప్రధాన రహదారుల్లో నవదుర్గా కటౌట్లతో పాటు తగిన ఏర్పాట్లు చేసి ముస్తాబు చేసినట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు మండల స్థాయి, జిల్లా స్థాయి అధికారులను, ఎంపీని, ఎమ్మెల్సీని, పలువురు ప్రముఖులను ఉత్సవాలకు ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, శ్రీ వాసవి కళ్యాణ మండపం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# నేటి నుండి శ్రీ హరిహర క్షేత్రంలో శ్రీ దేవి నవరాత్రి మహోత్సవాలు

### నిత్య అలంకారలతో భక్తులను అలరించనున్న అమ్మవారు
### మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతుల ఆధ్వర్యంలో క్షేత్రంలో విశేష పూజలు

(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, అక్టోబర్ 10)
నేటి నుండి అక్టోబర్ 20 వ తేదీ వరకు చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో జరగనున్న శ్రీ దేవి దసరా నవ రాత్రుల ఉత్సవాలు ప్రారంభం అవుతాయని మాజీమంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మి పద్మావతి దంపతులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు శిద్దా రాఘవరావు మాట్లాడుతూ ప్రతి ఏటా అనవాయితీలో భాగంగా వైభవంగా శిద్దా వెంకట సుబ్బమ్మ, వెంకటేశ్వర్లు ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీ దేవి దసరా శరన్నవరాత్రుల వేడుకలు చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో ఆదివారం నుండి ప్రారంభం అవుతాయని మాజీ మంత్రి శిద్దా తెలిపారు. ఆదివారం సాయంత్రం 6.30 నిమిషాలకు బాల త్రిపుర సుందరి దేవి అలంకారం, అంకురార్పణతో శ్రీ హరిహర క్షేత్రంలో మహోత్సవాలు ప్రారంభం అవుతాయని, ప్రతి రోజు అమ్మవారు వివిధ అలంకారాలతో భక్తులకు దర్శన భాగ్యంతో పాటు అమ్మవారికి విశేష పూజలు ప్రతి రోజు శ్రీ వాసవి అమ్మవారికి పంచామృత అభిషేకం, శ్రీ చక్ర నవార్చన, తీర్థ ప్రసాదాలు, శిద్దా లక్ష్మి పద్మావతి ఆధ్వర్యంలో ఉభయ దాతల పూజలు, ఆర్యవైశ్య మహిళా భక్తులచే సామూహిక శ్రీ లలిత సహస్ర నామ పారాయణం, కుంకుమ పూజలు, నిత్యం అన్న ప్రసాద వినియోగం ఉంటుందని శిద్దా రాఘవరావు తెలిపారు.



**అమ్మవారి అలంకరణ వివరాలు**

తొలి రోజు ఆదివారం అమ్మవారు శ్రీ బాల త్రిపుర సుందరి దేవి అలంకారంతో పాటుగా బాల పూజ నవ దుర్గ పూజ, 12వ తేది సోమవారం అమ్మవారు శ్రీ గాయత్రి దేవి తల్లి గా దర్శనంతో పాటు గాజుల అలంకరణ, 13వ తేది మంగళవారం అమ్మవారు శ్రీ అన్నపూర్ణ దేవి అలంకరణతో పాటు అమ్మవారు ధాన్యాభిషేకం, బుధవారం 14వ తేది అమ్మవారు శ్రీ కంచి కామాక్షి దేవి అలంకరణతో పాటుగా సాయంత్రం వాసవి మహిళలచే మణిద్వీప వర్ణన సౌందర్య లహరి పారాయణం, 15వ తేదీ గురువారం అమ్మవారు శ్రీ లలిత త్రిపుర సుందరి దేవి అలంకరణ, తదుపరి అమ్మవారికి పసుపు కొమ్ములతో అలంకరణ, 16వ తేది శుక్రవారం అమ్మవారు శ్రీ సరస్వతి దేవి అలంకరణ సాయంత్రం సరస్వతి పూజ, శాస్త్రీయ నృత్య ప్రదర్శన, 17వ తేది శనివారం అమ్మవారు శ్రీ మహాలక్ష్మి తల్లిగా భక్తులకు దర్శన భాగ్యం, సాయంత్రం శ్రీ అష్ట లక్ష్మి పూజల కనకాభిషేకం, 18వ తేదీ ఆదివారం అమ్మవారు శ్రీ దుర్గ దేవి అలంకారం, సాయంత్రం వనదుర్గదేవి అలంకరణ షోడాశ హారతులు, 19వ తేది సోమవారం అమ్మవారు శ్రీ మహిషాసుర మర్దని అలంకారం, సాయంత్రం సువాసినులకు పసుపు కుంకుమ పంపిణి, 20వ తేది మంగళవారం అమ్మవారు శ్రీ రాజ రాజేశ్వరి దేవి అలంకారం, సాయంత్రం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారుగా అలంకరణతో పాటుగా చెరుకు గడలతో అమ్మవారి దర్శన భాగ్యం ఉంటుందని తెలిపారు. అదే రోజు రాత్రికి క్షేత్రంలోని సాంగ సపరివార దేవతలకు శమీ పూజలు, శమీ దర్శనం, పార్వేట మహోత్సవం, పాల పిట్ట దర్శనం, ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో జరుగుతాయని తెలిపారు. కావున భక్తులందరు ఈ మహోత్సవంలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. శిద్దా వెంకటేశ్వర్లు, శిద్దా వెంకట సుబ్బమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, వాహన సౌకర్యం ధర్మ కర్తలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శ్రీ హరిహర క్షేత్రంలో జరిగే శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవంలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందగలరని కోరుతున్నట్లు మాజీ మంత్రి శిద్దా రాఘవరావు తెలిపారు.

## దసరా సెలవులను ఆనందంగా గడపండి ప్రమాదాలకు దూరంగా ఉండండి

### వెలిగొండ సందర్శనకు వెళ్లి ప్రమాదాలను కొనితెచ్చుకోవద్దు
### మార్కాపురం గ్రామీణ ఎస్ఐ వేమన

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, అక్టోబర్ 10)
దసరా సెలవులను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆనందంగా గడపాలని మార్కాపురం గ్రామీణ ఎస్ఐ వి వేమన సూచించారు. సెలవుల సమయంలో పిల్లలు సరదాగా గడిపే క్రమంలో అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాలకు గురికాకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. దసరా సెలవుల్లో విద్యార్థులు వెలిగొండ ప్రాంతాన్ని సందర్శించే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై హితవు పలికారు. ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లడం, భద్రతా నియమాలను నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రాణాపాయ పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందన్నారు. పర్యాటక ప్రాంతాలను సందర్శించేటప్పుడు పెద్దల పర్యవేక్షణలోనే వెళ్లాలని సూచించారు. పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారు? ఎవరితో వెళ్తున్నారు? అనే విషయాలపై తల్లిదండ్రులు నిరంతరం దృష్టి సారించాలని తెలిపారు. సెలవుల సమయంలో విద్యార్థుల భద్రతే ముఖ్యమని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా తీవ్ర ప్రమాదాలకు దారితీయవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పోలీసుల సూచనలు పాటిస్తూ దసరా సెలవులను సురక్షితంగా, సంతోషంగా గడపాలని ఎస్ఐ వి వేమన కోరారు.




## కనిగిరి జడ్పీటీసీ రేసులో ముందంజలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత మూలె గోపాల్‌రెడ్డి

### పార్టీ కార్యక్రమాలు, సేవా కార్యక్రమాల్లో మండలంలో ఆయనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు
### జెడ్పిటిసిగా తమ నేతకు అవకాశం కల్పించాలని ఎదురుచూస్తున్న ఆయన అభిమానులు





(షణ్ముఖ వెలుగు, కనిగిరి, అక్టోబర్ 10)
రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కనిగిరి మండల రాజకీయాలు ఊపందుకున్నాయి. కనిగిరి మండలం జడ్పీటీసీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వ రేసులో పార్టీ సీనియర్ నాయకులు, వైఎస్సార్‌సీపీ జిల్లా సెక్రటరీ మూలే గోపాల్‌రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. పార్టీ వర్గాలతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా ఆయన పేరు ముందంజలో ఉన్నట్లు బలమైన సంకేతాలు కనిపిస్తున్నాయి.

**పార్టీకి నమ్మకమైన సేనాపతి**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థాపించిన నాటి నుండి మూలే గోపాల్ రెడ్డి పార్టీ ఆశయాలకు కట్టుబడి పని చేస్తున్నారు. పార్టీ పిలుపు నిచ్చిన ప్రతి కార్యక్రమంలోనూ చురుగ్గా పాల్గొంటూ, కేడర్‌లో నూతన ఉత్సాహాన్ని నింపుతున్నారు. జిల్లా స్థాయి నాయకులతో, నియోజకవర్గ స్థాయి అభ్యర్థులతో ప్రత్యేక సమన్వయం పాటిస్తూ, పార్టీ పటిష్టతకు ఆయన నిరంతరం కృషి చేస్తున్నారు.

**నాయకత్వంతో సన్నిహిత సంబంధాలు**

పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాదరెడ్డి, పార్లమెంటరీ ఇంచార్జి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ల ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ నమ్మకమైన నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జ్ దద్దాల నారాయణ యాదవ్ కు అత్యంత సన్నిహితుడు కావడంతో పాటు, నియోజకవర్గ రాజకీయాలపై మంచి పట్టు ఉండటం గోపాల్‌రెడ్డికి మరింత ప్లస్ పాయింట్‌గా మారింది. పార్టీ 2024 ఎన్నికల్లో ఓటమికి చెందినప్పటికీ పార్టీ వెన్నుదన్నుగా నిలుస్తూ కార్యకర్తలకు నాయకులకు అండదండగ ముందుకు సాగుతున్నారు.

**ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు – పెరిగిన ఆదరణ**

కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా, కనిగిరి మండల ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ అనేక సేవా కార్యక్రమాలను ఆయన నిర్వహిస్తున్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేసే మూలే గోపాల్‌రెడ్డి లాంటి ఉత్కృష్టమైన వ్యక్తి జడ్పీటీసీ అభ్యర్థిగా రావడంపై స్థానిక ప్రజల నుండి కూడా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన అభ్యర్థిత్వాన్ని కనిగిరి మండల ప్రజలు సైతం మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో స్పష్టమవుతోంది. రాబోయే రోజుల్లో అధిష్ఠానం నిర్ణయం పై పార్టీ వర్గాల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది.

# మహాలయ అమావాస్య వేడుకలు బద్వేల్‌లో ఘనంగా తర్పణాలు, అన్నదానం





(షణ్ముఖ వెలుగు, బద్వేల్, అక్టోబర్ 10)
మహాలయ అమావాస్యను పురస్కరించుకుని బద్వేల్ పట్టణంలో వాసవి క్లబ్, వనిత క్లబ్ ఆధ్వర్యంలో పితృదేవతల స్మరణార్థం ప్రత్యేక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక కోదండ రామాలయంలో పితృదేవతల సంతృప్తి, పెద్దల ఆశీస్సుల కోసం మహాలయ అమావాస్య తర్పణాల కార్యక్రమం చేపట్టారు. ఈ వేడుకల్లో బద్వేల్ ప్రాంతానికి చెందిన పలువురు ఆర్యవైశ్యులు భక్తిశ్రద్ధలతో తమ పెద్దలకు తర్పణాలు సమర్పించుకున్నారు. అనంతరం పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో దాతల సహకారంతో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు కెవి సుబ్బారావు, జిల్లా ఉపాధ్యక్షులు కొలిశెట్టి నాగరాజా, వైభవ్ ప్రసాద్, జిల్లా మెడికల్ కమిటీ చైర్మన్ దర్శి సుబ్బరాజా, జిల్లా ట్రెజరర్ పబ్బతి చంద్రశేఖర్, సెక్రటరీ సివి నాగేశ్వరరావు, జిల్లా జాయింట్ సెక్రటరీ సముద్రాల పుల్లయ్య, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మదళ్లపల్లె సత్యం, కడప జిల్లా ఆర్యవైశ్య మహిళా మండలి జాయింట్ సెక్రటరీ చింతకుంట ధనలక్ష్మి తదితరుల చేతుల మీదుగా పేదలకు, బాటసారులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమానికి ఆర్థికంగా, వస్తురూపేణా సహకరించిన దాతలను ఘనంగా శాలువాలతో సత్కరించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు భూపాలం రాఘవ, సెక్రటరీ వెంకటరమణ, ట్రెజరర్ బైసాని సుమంత్, వనిత క్లబ్ అధ్యక్షురాలు చాటకొండు కోటేశ్వరమ్మ, సెక్రటరీ వెంకటసుబ్బమ్మ, ట్రెజరర్ బచ్చు పార్వతమ్మతో పాటు మాజీ ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు బచ్చు సుబ్రహ్మణ్యం, కోదండ రామాలయం అధ్యక్షులు పేర్ల జనార్ధన రావు, కొండపల్లి సుభాష్, కొప్పరపు నాగేంద్ర, పత్తి ప్రతాప్, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## పిఆర్‌సి రిపోర్టు వచ్చే లోపు ఐఆర్ 30% చెల్లించాలి

### పెన్షనర్లకు డిఆర్ అరియర్స్
### ఒకేసారి చెల్లించేటట్లు సవరణ ఉత్తర్వులు ఇవ్వాలి




(షణ్ముఖ వెలుగు, పొదిలి, అక్టోబర్ 10)
పిఆర్‌సి రిపోర్టు వచ్చేలోపు ఐఆర్ 30 శాతం చెల్లించాలని పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి షేక్ మదార్ వలి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పొదిలి పెన్షనర్ల భవనంలో శనివారం సంఘం అధ్యక్షులు బాదుల్లా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షనర్లకు డియర్ బకాయిలు వాయిదాల పద్ధతిలో కాకుండా ఒకేసారి చెల్లించుటకు సవరణ ఉత్తర్వులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసోసియేటెడ్ అధ్యక్షులు డిఎల్ నరసింహారావు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ద్వారా ఉద్యోగులకు, పెన్షనర్లకు సరియైన వైద్య సదుపాయం కల్పించాలని, మెడికల్ రియంబర్స్మెంట్ బిల్లులు ఎస్‌టిఓల ద్వారా పంపుటకు సరైన మార్గదర్శకాలను వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నూతనంగా సంఘంలో చేరిన పెన్షనర్ గుర్రం మల్లికార్జున ను పుష్పగుచ్చంతో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షులు వీరారెడ్డి, అధ్యక్షులు బాదుల్లా, ప్రధాన కార్యదర్శి మదార్ వలి, ట్రెజరర్ చిట్టంశెట్టి సుబ్బారావు, మోహన్‌రావు, మహిళా కార్యదర్శి దానమ్మ, ఇతర పెన్షనర్లు పాల్గొన్నారు.

# రొమ్ము క్యాన్సర్ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

### హెచ్‌సిజి ఎంఎన్ఆర్ క్యాన్సర్ హాస్పిటల్ రీజనల్ బిజినెస్ హెడ్ డాక్టర్ రూపాలి

### హాస్పిటల్లో ఘనంగా పలు అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, మెరుగైన వైద్య సదుపాయాలు ప్రారంభం







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 10)

రొమ్ము క్యాన్సర్ పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని హెచ్‌సిజి ఎంఎన్ఆర్ క్యాన్సర్ హాస్పిటల్ రీజనల్ బిజినెస్ హెడ్ డాక్టర్ రూపాలి పేర్కొన్నారు. ప్రపంచ రొమ్ము క్యాన్సర్ మాసాన్ని పురస్కరించుకొని స్థానిక హెచ్‌సిజి ఎంఎన్ఆర్ క్యాన్సర్ హాస్పిటల్ లో రెండు ఆధునిక మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు, ఆధునిక ఇన్సెంటివ్ కేర్ యూనిట్, ప్రత్యేక పోస్ట్ ఆపరేటివ్ వార్డ్, ఆధునిక సెంట్రల్ స్టరైల్ సర్వీసెస్ డిపార్ట్మెంట్ లను డాక్టర్ రూపాలి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ రూపాలి మాట్లాడుతూ విదేశాలలో రొమ్ము క్యాన్సర్ పై ప్రత్యేక దృష్టి సాధించడం ద్వారా తక్కువగా నమోదు అవుతున్నాయి అన్నారు. అయితే మన దేశంలో నొప్పిరాని రొమ్ము గడ్డలను అశ్రద్ధ చేస్తున్నారన్నారు. రూము కట్టెలలో నొప్పి వస్తే అది ఇన్ఫెక్షన్ వల్ల వచ్చే అవకాశం ఉందన్నారు. నొప్పి రాకపోతే అవి క్యాన్సర్ గడ్డలు అయ్యే అవకాశం ఉందన్నారు. అందుకని రొమ్ము గడ్డలు ఉన్న ప్రతి ఒక్కరు వెంటనే వైద్యుని సంప్రదించడం మంచిదన్నారు. హెచ్ సి జి ఎమ్ ఎన్ ఆర్ క్యాన్సర్ హాస్పిటల్ ప్రారంభమైన 12 సంవత్సరాల కాలంలో ఇప్పటివరకు 5000 పైగా క్యాన్సర్ చికిత్సలు, 6000 పైగా రేడియేషన్ థెరపీ చికిత్సలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. హాస్పిటల్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ సమగ్ర క్యాన్సర్ వైద్య సేవలు ఎల్లప్పుడూ హెచ్సీజీ ఎమ్మెల్యే క్యాన్సర్ హాస్పిటల్లో ప్రజలకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రఘునందన్ మాట్లాడుతూ ఆధునిక రేడియేషన్ సాంకేతికత వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. చీఫ్ ఆపరేటివ్ ఆఫీసర్ సాతులూరి మూర్తి, మార్కెటింగ్ మేనేజర్ మాట్లాడుతూ హాస్పిటల్లో వైద్య పరంగా జరుగుతున్న అభివృద్ధి, అందిస్తున్న మౌలిక సదుపాయాలు, ఆధునిక వైద్య సౌకర్యాలు, అందిస్తున్న మెరుగైన వైద్య సేవలు గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రపంచ రూమ్ క్యాన్సర్ అవగాహన పోస్టర్ ను ఆవిష్కరించారు.

# కొలిశెట్టి హరీష్ జయంతి సందర్భంగా అన్నదానం







(షణ్ముఖ వెలుగు, బద్వేల్, అక్టోబర్ 10)

ప్రముఖ వ్యాపారవేత్త కొలిశెట్టి నాగరాజా కుమారుడు కీర్తిశేషులు కొలిశెట్టి హరీష్ జయంతి సందర్భంగా బద్వేల్ పట్టణంలోని ఆనంద నిలయం లోని అనాధ వృద్ధులకు అన్నదానం, ఫ్రూట్స్ తినుబండారాలు వితరణ కార్యక్రమాన్ని కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు కొలిశెట్టి నాగరాజ, ఆధ్వర్యంలో జిల్లా గౌరవాధ్యక్షులు కెవి సుబ్బారావు, ఉపాధ్యక్షులు వైభవ్ ప్రసాద్, జిల్లా జాయింట్ సెక్రెటరీ సముద్రాల పుల్లయ్య, వారి కుటుంబ సభ్యుల చేతుల మీదుగా పలువురికి అన్నదాన కార్యక్రమం చేపట్టి అనంతరం మృతి చెందిన హరీష్ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని పలువురు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చిన్ని నాగేంద్ర, రెడ్డయ్య, ఆశ్రమ నిర్వాహకులు రవికుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# విద్వేషాలు రెచ్చగొట్టడమే వైసీపీ పని

## ఎన్నికలు, బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవాలని చూసింది వాళ్లే

## స్థానిక ఎన్నికల్లో గొడ్డలి పార్టీకి బుద్ధి చెప్పండి

### మంచి చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

### ప్రజలకు పిలుపునిచ్చిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

### 122 మందికి 58.36 లక్షల సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, అక్టోబర్ 10)

కులాలు, ప్రాంతాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టడంతో పాటు మంచి పనులకు అడుగడుగునా అడ్డుపడుతున్న గొడ్డలిపార్టీకి స్థానిక ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆర్థిక సహాయాలు అందించడంలో భాగంగా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 45 వ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం నిర్వహించారు. 122 మంది లబ్ధిదారులకు 58.36 లక్షల సహాయాలను ఎమ్మెల్యే గారు అందించారు. గుడ్లూరు మండలంలో 41 మందికి 20,30,572 రూపాయలు, కందుకూరు అర్బన్ పరిధిలో 6 మందికి 3,38,659 రూపాయలు, లింగసముద్రం మండలంలో 32 మందికి 14,86,088 రూపాయలు, ఉలవపాడు మండలంలో 37 మందికి 16,82,405 రూపాయలు, వలేటివారిపాలెం మండలంలో ముగ్గురికి 1,48,583 రూపాయలు, ఒకరికి ఎల్‌ఓసి ద్వారా 49,492 రూపాయల విలువైన చెక్కులను నాగేశ్వరరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటివరకు 1982 మందికి 15 కోట్ల రూపాయలు సహాయంగా అందించామని ఆయన తెలిపారు. వైసిపి పేటీఎం బ్యాచ్ కూటమి ప్రభుత్వం పై బురద చల్లుతూ పోస్టులు పెట్టి పైశాచిక ఆనందం పొందుతోందన్నారు. జగన్ పాలనలో ప్రజల కోసం చేసిందేమీ లేదు. మంచి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి అడ్డుపడుతున్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇస్తామంటే, వద్దని కోర్టుకు వెళ్లారు. స్థానిక ఎన్నికలు జరపొద్దని పిటీషన్లు వేశారు. ఎన్నికలు జరిగితే, నిధులు దండిగా వస్తాయి, మరింత అభివృద్ధి జరుగుతుందన్న అక్కసుతో వైసీపీ నేతలు ప్రవర్తిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో వారికి బుద్ధి చెప్పాలి. రాష్ట్ర అభివృద్ధి కోసం చంద్రబాబు నాయుడు విపరీతంగా కష్టపడుతున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వైద్యసహాయాలు అందిస్తున్నారు. త్వరలో కొత్త పింఛన్లు, ఇళ్ల స్థలాలు అందించబోతున్నాం. ఈ రెండేళ్లలో మేము చేసిన అభివృద్ధి, సంక్షేమం మీ కళ్ళ ముందు కనిపిస్తూనే ఉంది. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి తేడా గమనించండి. కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదిస్తూ స్థానిక ఎన్నికల్లో ఓటు వేయండి అని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, పూరిమిట్ల గురునాథం, జనిగర్ల నాగరాజు, ఏఎంసీ డైరెక్టర్లు కొత్తూరి వెంకట సుధాకర్, మాదాల వెంకటేశ్వర్లు, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కల్లూరి శైలజ, ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షురాలు పువ్వాడి మౌనిక, క్లస్టర్ ఇన్చార్జులు చిత్తారి మల్లికార్జున, ఉమ్మనేని సుబ్బారావు, పట్టణ నాయకులు ముచ్చు వేణు, చుండూరి శ్రీను, పులి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.





# రహదారుల అభివృద్ధికి రూ.5 కోట్ల నిధులు

### పల్లె పండుగ 3.0లో పలు సీసీ, తారు రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

(షణ్ముఖ వెలుగు, కంభం, అక్టోబర్ 10)

మండలంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాలను మెరుగుపరిచే దిశగా కీలక ముందడుగు పడింది. పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా సుమారు రూ.5 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ రహదారుల నిర్మాణ పనులకు గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి శనివారం శంకుస్థాపన చేసి, భూమిపూజ నిర్వహించారు. ఈ అభివృద్ధి పనుల్లో భాగంగా జంగంగుంట్ల గ్రామంతో పాటు కంభం పట్టణంలోని రైల్వే స్టేషన్ నుంచి అర్బన్ కాలనీ వరకు, హజరత్ గూడెం నుంచి అంకాలమ్మ గుడి వరకు సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. అలాగే కందులాపురం నుంచి రావిపాడు వరకు, హజరత్ గూడెం నుంచి రావిపాటి హైవే వరకు తారు రోడ్ల నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు ప్రారంభించారు.

#### రహదారి సమస్యలకు పరిష్కారం దిశగా అడుగులు

ఏళ్లుగా రహదారి సౌకర్యాల మెరుగుదల కోసం ఎదురుచూస్తున్న ప్రాంతాల్లో నిర్మాణ పనులు ప్రారంభం కానుండటంతో స్థానిక ప్రజల్లో ఆనందం వ్యక్తమైంది. రోడ్ల నిర్మాణం పూర్తయితే ప్రయాణాలు సులభతరమవడంతో పాటు, గ్రామాల మధ్య రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని స్థానికులు శాలువాలు, పూలమాలలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఈ పనులు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కంభం మండలానికి చెందిన ప్రముఖులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.







# 114 మందికి రూ.52.02 లక్షల సీఎం సహాయనిధి



(షణ్ముఖ వెలుగు, చీరాల, అక్టోబర్ 10)

చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య చొరవతో చీరాల నియోజకవర్గానికి చెందిన 114 మంది లబ్ధిదారులకు రూ.52,02,778 సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 1,394 మందికి రూ.11.64 కోట్ల సీఎం సహాయనిధిని అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్న బాధితులు వైద్య ఖర్చుల రసీదులతో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకుంటే, పరిశీలన అనంతరం అర్హులకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు సీఎం సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని తెలిపారు. సీఎం సహాయనిధి అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్యకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్ధన్, పట్టణ, గ్రామ పార్టీ అధ్యక్షులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# బడి బాటకు సైకిల్ బాట
# పేదరికం చదువుకు అడ్డుకాకూడదు

### ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు దామచర్ల సైకిళ్ల పంపిణీ
### పాఠశాలకు వెళ్లే చిన్నారులకు
### దాతల సహకారంతో 1,100 సైకిళ్ల అందజేత







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 10)

చదువుకోవాలనే తపన ఉంది.. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరాలనే ఆశయం ఉంది.. కానీ పాఠశాలకు వెళ్లేందుకు సరైన రవాణా సౌకర్యం లేకపోతే. పేదరికం కారణంగా సైకిల్ కొనలేని పరిస్థితి ఎదురైతే.. ఇబ్బందులను ఎదుర్కొంటున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థిని,విద్యార్థులకు అండగా నిలిచే ప్రయత్నమే ఈ సైకిళ్ల పంపిణీ కార్యక్రమం. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన అనేకమంది విద్యార్థులు దూరప్రాంతాల్లో ఉన్న పాఠశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పిల్లల చదువుపై ఆసక్తి ఉన్నా, ఆర్థిక పరిస్థితుల కారణంగా వారి అవసరాలను తీర్చలేక కొందరు తల్లిదండ్రులు సతమతమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థులకు అండగా నిలిచేందుకు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ముందుకొచ్చారు. అమరావతి సేవా ట్రస్ట్ సహకారంతో ఒంగోలు వి ం నీ స్టేడియంలో ప్ర భు త్వ



పాఠశాలల విద్యార్థులకు ఒకటి కాదు రెండు కాదు 1100 సైకిళ్లను పంపిణీ చేశారు. పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో సైకిళ్లను అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి అమరావతి సేవా ట్రస్ట్‌తో పాటు పలువురు దాతలు సహకారం అందించారు. సింగరాయకొండకు చెందిన దేవి సీ ఫుడ్స్, ధనిక్ భారత్ విద్యా సంస్థలు, ప్రకాశం జిల్లా పీడీసీసీ బ్యాంక్, టంగుటూరుకు చెందిన ప్రగతి టుబాకో ట్రేడర్స్, అసిస్ట్ ఇండియా, మున్నంగి రాజశేఖర్ తమ వంతు సహకారం అందించారు. ఈ సందర్భంగా దూరప్రాంతాల్లోని పాఠశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న తమ పిల్లలకు సైకిళ్లు అందించి అండగా నిలిచిన ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌కు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, ఏఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, అమరావతి సేవా ట్రస్ట్ ప్రతినిధులు పావులూరి బాపయ్య, కంచర్ల వెంకటనారాయణ, మన్నం వేణుబాబు, అబ్బూరి నవీన్, బండారు మదన్,గార్లపాటి శ్రీనివాసరావు, గుంటూరి హరి, కాశీ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



# నేటి నుండి త్రిపురాంతకం క్షేత్రాలలో దసరా శరన్నవరాత్రుల మహోత్సవాలు

### నేటి నుండి 20వ తారీకు వరకు శరన్నవరాత్రులు
### అంగరంగ వైభవంగా దసరా ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు
### అమ్మవారు రోజుకొక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు
### 20వ తేదీ విజయదశమి సందర్భంగా అమ్మవారిని రాజరాజేశ్వరి దేవి అలంకరించి సింహ వాహనంపై గ్రామోత్సవం



(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, అక్టోబర్ 10)

మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన శ్రీమత్ బాల త్రిపుర సుందరి దేవి అమ్మవారు, శివ పార్వతి దేవి అమ్మవార్ల ఆలయాలలో దసరా ఉత్సవాలు ఈనెల 11 ఆదివారం నుండి 20 మంగళవారం వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ధర్మకర్తల మండలి చైర్మన్ మోటకట్ల శ్రీనివాసరెడ్డి, ఆలయ ఈవో డి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్నట్లు తెలిపారు. ఈ ఆలయం నాలుగు ద్వారక్షేత్రాలతోనూ నాలుగు ఉపద్వారాల క్షేత్రాలతోనూ విరాజిల్లుతున్న శ్రీశైల క్షేత్రానికి తూర్పు ద్వారం మనీ పురాణాలు తెలియజేస్తున్నాయి. ఈ క్షేత్రంలోనే త్రిపుర సుర సంహారం జరిగినట్లు పండితరాధ్య చరిత్ర చెబుతుంది. త్రిపుర సుర సంహారం తర్వాత శివుడు ఇచ్చటి కుమారగిరి పై త్రిపురాంతకేశ్వరునిగా వెలిసినట్లు, కుమారగిరికి నైరుతి భాగంలో చెరువులో ఉన్న సితగ్ని గుండం నుండి ఆవిర్భవించిన శ్రీమత్ బాల త్రిపుర సుందరి రాక్షస సంహారం చేసినట్లు, కదంబవన మధ్యలో త్రిపురాంతక పితేశ్వరిదేవిగా వెలిసినట్లు చెప్పబడుతుంది. కుమారస్వామి తారసకుని సంహరించినది. ఈ కొండ పైన నేనని చతుషష్ట యెగినీముర్తులు దర్శనమిస్తారని ప్రతీతి. ఒకప్పుడు శ్రీశైల మహా క్షేత్రానికి కాలినడకన సందర్శించ వచ్చే భక్తులకు ఉత్తర భారతం, ఆంధ్రప్రదేశ్ సర్కారు ప్రాంతాల వారు ఈ త్రిపురాంతక క్షేత్రాన్ని దర్శించి శ్రీశైల క్షేత్రనికి వెళ్లేవారని స్వరంగ మార్గం ఉన్నదని పురాణాలు తెలిపాయి. ఈ మహా క్షేత్రంలో దసరా శరన్నవరాత్రులలో అమ్మవారు రోజు ఒక అలంకరణలో పల్లకి సేవలో భక్తులకు దర్శనమిస్తారు. కాబట్టి ఈ ఉత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శన భాగ్యాన్ని కలగజేసుకోవాలని, వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాట్లు చేసినట్లు, అంతేకాకుండా గుంటూరు కర్నూల్ హైవే రోడ్డుకు రెండు కిలోమీటర్ల దూరంలో ఈ దేవాలయాలు వెలిసి ఉన్నట్లు ఆలయ ఈవో ఓ ప్రకటనలో తెలిపారు.



# కంభంలో శాంతి కమిటీ సమావేశం
## ప్రశాంతంగా దసరా వేడుకలు నిర్వహించాలి
## హిందూ, ముస్లింలు అన్నదమ్ముల్లా కలిసిమెలిసి పండుగ జరుపుకోవాలి
## డీఎస్పీ నిమ్మగడ్డ సత్యనారాయణ







(షణ్ముఖ వెలుగు, కంభం, అక్టోబర్ 10)

మార్కాపురం జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా ఆదేశాల మేరకు కంభం పట్టణంలో దసరా పండుగను ప్రశాంత వాతావరణంలో, సోదరభావంతో జరుపుకునేందుకు కంభం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో శనివారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మార్కాపురం డీఎస్పీ నిమ్మగడ్డ సత్యనారాయణ, కంభం సీఐ మల్లికార్జున, ఎస్ఐ శివకృష్ణారెడ్డి, ఎంపీడీవో బ్రహ్మయ్య, విద్యుత్‌శాఖ ఏఈ నరసయ్యతో పాటు కంభం పట్టణంలోని ముస్లిం పెద్దలు, ఇతర మతపెద్దలు పాల్గొన్నారు.

పండుగను ఐకమత్యంతో జరుపుకోవాలి

**డిఎస్పీ నిమ్మగడ్డ సత్యనారాయణ**

ఈ సందర్భంగా డీఎస్పీ నిమ్మగడ్డ సత్యనారాయణ మాట్లాడుతూ దసరా పండుగకు కంభం పట్టణం ప్రత్యేక గుర్తింపు కలిగి ఉందని, పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. హిందూ, ముస్లింలు అన్నదమ్ముల్లా కలిసిమెలిసి, పరస్పర గౌరవం, సోదరభావంతో పండుగను జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

**శాంతిభద్రతలకు సహకరించాలి**
**సీఐ మల్లికార్జున**

కంభం సీఐ మల్లికార్జున మాట్లాడుతూ పండుగ సమయంలో ప్రజలు సంయమనం పాటించాలని, ఇతరులకు ఇబ్బందులు కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. పండుగ వేడుకలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు, మతపెద్దలు సమన్వయంతో వ్యవహరించాలని తెలిపారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**
**ఎస్ఐ శివకృష్ణారెడ్డి**

కంభం ఎస్ఐ శివకృష్ణారెడ్డి మాట్లాడుతూ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిన్నచిన్న వివాదాలకు




తావివ్వకుండా పరస్పర సహకారంతో పండుగను ఆనందంగా జరుపుకోవాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రజలు సహకరించాలని తెలిపారు.

**విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు**
**ఏఈ నరసయ్య**

విద్యుత్‌శాఖ ఏఈ నరసయ్య మాట్లాడుతూ దసరా పండుగ సందర్భంగా విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. పండుగ ఏర్పాట్ల సమయంలో విద్యుత్ తీగలు, విద్యుత్ సరఫరా విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏవైనా విద్యుత్ సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

**ఐకమత్యమే కంభం ప్రత్యేకత**

శాంతి కమిటీ సమావేశంలో పాల్గొన్న మతపెద్దలు, పట్టణంలో మతసామరస్యం కొనసాగేందుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవంతో వ్యవహరిస్తూ, శాంతియుత వాతావరణంలో దసరా పండుగను జరుపుకోవాలని సమావేశంలో సూచించారు. ప్రజలందరి సహకారంతో కంభం పట్టణంలో దసరా పండుగను శాంతియుతంగా, సంతోషంగా నిర్వహించుకోవాలనే సందేశంతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ మతాల పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

# దసరా పండుగకు ముందే విద్యార్థుల జీవితాల్లో ఆనందాల పండుగ





## ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 10)**

దసరా పండుగకు ముందే విద్యార్థుల జీవితాల్లో ఆనందాల పండుగ అని, చదువుల బాటలో ఎదురవుతున్న దూరభారానికి సైకిళ్లతో చెక్ పెడుతూ పేద విద్యార్థుల చదువుకు అండగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు నిలిచారు. ఒంగోలు నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న 1100 మంది విద్యార్థులకు శనివారం ఒకేసారి సైకిళ్ల పంపిణీ చేపట్టారు. అమరా వతి సేవా ట్రస్ట్ సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమం విద్యార్థుల ముఖాల్లో చిరునవ్వులు పూయించింది. సైకిళ్లు కొనలేని పేద తల్లిదండ్రులకు ఊరటనివ్వడమే కాకుండా విద్యార్థుల చదువుకు కొత్త ఉత్సాహాన్ని నింపింది. సైకిళ్లు అందుకున్న చిన్నారుల ఆనందం మినీ స్టేడియంలో పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చింది.

**సైకిళ్ళ పండుగ**

పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదు..ఆర్థిక ఇబ్బందులు విద్యార్థుల భవిష్యత్తును దూరం చేయకూడదు. కానీ నేటికీ అనేక పేద కుటుంబాల్లో పిల్లలకు సైకిల్ కొనివ్వడం కూడా భారంగా మారుతోంది. ఇంటి నుంచి పాఠశాల దూరంగా ఉండటంతో పుస్తకాల సంచిని భుజాన వేసుకుని కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి. పిల్లల కష్టాన్ని చూస్తూ వారికి సైకిల్ కొనివ్వలేని తమ ఆర్థిక పరిస్థితిని చూసి తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఆ పేద తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి విద్యార్థుల చదువుకు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు అండగా నిలిచే ప్రయత్నం చేశారు. ఒంగోలు నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న 1100 మంది విద్యార్థులకు అమరావతి సేవా ట్రస్ట్ సహకారంతో సైకిళ్లను పంపిణీ చేశారు. నగరంలోని మినీ స్టేడియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఒక్కొక్కరికి సుమారు రూ.5 వేల విలువైన సైకిల్‌ను ఉచితంగా అందించారు. సైకిల్ కొనివ్వాలన్న తమ కోరికను ఆర్థిక పరిస్థితుల కారణంగా నెరవేర్చలేకపోయిన తల్లిదండ్రులకు ఈ కార్యక్రమం ఊరటనిచ్చింది. తమ పిల్లల చదువుకు ఉపయోగపడేలా సైకిళ్లు అందించిన ఎమ్మెల్యేకు వారు కృతజ్ఞతలు తెలిపారు. సైకిల్ అంటే కేవలం ప్రయాణ సాధనం మాత్రమే కాదు, పాఠశాలకు చేరుకోవడానికి సులభమైన మార్గం, సమయాన్ని ఆదా చేసే సాధనం, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచే తోడు. ఈ ఉద్దేశంతో చేపట్టిన సైకిళ్ల పంపిణీ చిన్నారుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఇక సైకిళ్లు అందుకున్న విద్యార్థుల ఆనందానికి అవధుల్లేవు. తమకు నచ్చిన సైకిళ్లపై కూర్చుని సంతోషంగా తొక్కుకుంటూ మినీ స్టేడియం నుంచి ఇళ్లకు బయలుదేరారు. కొత్త సైకిల్‌ను సొంతం చేసుకున్న ఆనందం వారి ముఖాల్లో స్పష్టంగా కనిపించింది. పేదరికం కారణంగా పిల్లల చదువుకు ఆటంకం కలగకూడదు. ప్రతి విద్యార్థికీ మెరుగైన విద్యావకాశాలు అందాలి. ఈ లక్ష్యంతో చేపట్టిన సైకిళ్ల పంపిణీ కార్యక్రమం ఒంగోలులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.







# ఎస్ఐఆర్ పేరుతో ఓటు హక్కు పై దాడి
# ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

## కలెక్టరేట్ ఎదుట వామపక్షాల ధర్నా
## అప్రకటిత ఎమర్జెన్సీని తిప్పికొట్టాలని పిలుపు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 10)**

ఎస్ఐఆర్ పేరుతో అర్హులైన పౌరుల ఓటు హక్కును హరించే కుట్రలను తిప్పికొట్టాలని, ఎన్నికల ప్రజాస్వామ్య పరిరక్షణలో విఫలమైన ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీని తలపించే నిర్బంధ పాలన సాగుతోందని విమర్శించారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు వామపక్షాలు, ప్రజాసంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. వామపక్ష పార్టీల రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా శనివారం ఒంగోలులోని కలెక్టరేట్ ఎదుట సీపీఎం, సీపీఐ, సిపిఐ (ఎంఎల్), సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, సీపీఐ నగర సమితి కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమం లో సీపీఎం ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎస్‌కె మాబు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యాన్ని, ప్రజల రాజ్యాంగ హక్కులను అణచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఎస్ఐఆర్ పేరుతో ఓటర్ల జాబితా నుంచి పెద్ద సంఖ్యలో పేర్లను తొలగించడం వెనుక ఉన్న ఉద్దేశాలను ప్రజలు ప్రశ్నించాలని కోరారు. సాధారణంగా ప్రతి సంవత్సరం మరణించిన వారి పేర్లను తొలగించడం, అర్హులైన కొత్త ఓటర్లను చేర్చడం వంటి ప్రక్రియలు జరుగుతాయని, అయితే ఒకేసారి భారీ సంఖ్యలో ఓటర్లను తొలగించడం, మరి కొంతమందికి నోటీసులు జారీ చేయడం అనేక సందేహాలకు తావిస్తోందన్నారు. అర్హులైన ఓటర్లు తమ హక్కును నిరూపించుకోవాల్సిన పరిస్థితిని సృష్టించడం ఆందోళనకరమని పేర్కొన్నారు. గతంలో పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌర పట్టిక (ఎన్ఆర్సీ) పేరుతో ప్రజల్లో ఆందోళనలు చెలరేగాయని మాబు గుర్తుచేశారు. వాటికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమాలు జరిగాయని చెప్పారు. ఇప్పుడు ఎస్ఐఆర్ పేరుతో మరోసారి ప్రజల హక్కులను ప్రశ్నార్థకం చేసే పరిస్థితులు కల్పిస్తున్నారని విమర్శించారు. పేదలు, దళితులు, గిరిజనులు, వలస కార్మికులు, నిరక్షరాస్యులు పాత పత్రాలు, పూర్వీకుల రికార్డులు సమర్పించలేక ఇబ్బందులు పడే ప్రమాదం ఉందన్నారు. జీవనోపాధి కోసం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వలస వెళ్లే కార్మికులు, నివాసాలు మారే ప్రజలు ఓటు హక్కును కోల్పోకూడదని స్పష్టం చేశారు. దేశంలోని పరిశ్రమలు, వ్యవసాయ రంగం సహా కీలక రంగాలపై కార్పొరేట్ శక్తుల ఆధిపత్యాన్ని పెంచేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందని మాబు ఆరోపించారు. అందుకే ప్రజల ఐక్యతను దెబ్బతీసే విధానాలను ముందుకు తెస్తున్నారని అన్నారు. రాజ్యాంగ హక్కులపై దాడులను విడివిడిగా చూడకుండా, ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగంగా సమష్టిగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. దేశ రాజధాని ఢిల్లీలో నిరసనలను అడ్డుకునేందుకు భారీగా భద్రతా బలగాలను మోహరించడం, రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగించడం, రైల్వే స్టేషన్లను మూసివేయడం వంటి చర్యలు అప్రకటిత ఎమర్జెన్సీని తలపిస్తున్నాయని మాబు విమర్శించారు. విజయవాడలోనూ వామపక్ష కార్యాలయాల వద్ద నిర్బంధాలు విధించి నాయకులను కదలనివ్వకుండా అడ్డుకునే ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును అణచివేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఎన్ని ఆంక్షలు విధించినా, ఎన్ని నిర్బంధాలు ప్రయోగించినా ప్రజల ఉద్యమాలను ఆపలేరని స్పష్టం చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూనే, ఎస్ఐ ఆర్ పేరుతో ప్రజల ఓటు హక్కుకు భంగం కలిగించే విధానాలను వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పోరాటం ఒక్క ఓటు హక్కుకే పరిమితం కాదని, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, పౌర హక్కుల పరిరక్షణకు సంబంధించినదని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని, వామపక్షాలు ముందుండి ప్రజాస్వామ్యవాదులు, ప్రజాసంఘాలను సమీక రించాలని పిలుపునిచ్చారు.సీపీఐ జిల్లా కార్యదర్శి ఆర్.వెంకట్రావు మాట్లాడుతూ.. ఓటు హక్కు ప్రభుత్వాలు ఇచ్చే భిక్ష కాదని, రాజ్యాం గం కల్పించిన ప్రజాస్వామ్య హక్కు అని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ఒక్క ఓటరు కూడా హక్కును కోల్పోకుండా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తొలగించిన పేర్లను పునఃపరిశీలించి, అర్హులకు తిరిగి అవకాశం కల్పించాలని కోరారు. సీపీఐ(ఎంఎల్) నాయకురాలు ఎస్.లలిత కుమారి మాట్లాడుతూ పాత పత్రాలు, పూర్వీకుల రికార్డులు లేని కారణంగా పేద ప్రజలను ఓటు హక్కుకు దూరం చేయడం అన్యాయమన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకత పాటించి, ప్రజల్లో నెలకొన్న సందేహాలను ఎన్నికల సంఘం నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి సీహెచ్‌వీ సాగర్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించేలా ఎన్నికల సంఘం వ్యవహరించాలని కోరారు. అర్హులైన పౌరుల ఓటు హక్కుకు భంగం కలిగితే ప్రజాస్వామ్య వ్యవస్థ బలహీన పడుతుందని హెచ్చరించారు.

ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ప్రజా స్వామ్య వాదులంతా ఐక్యమై పోరాటాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ సీనియర్ నాయకులు ఏ వి పుల్లారావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.రమేష్, ఏఐటీయూసీ జిల్లా కార్య దర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, ఐఎఫ్‌టీయూ నాయకులు పేరయ్య, తదితరులు మాట్లాడారు. కార్యక్రమం లో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి.రఘురామ్, వి.బాలకోటయ్య, కె.రమాదేవి, పి.కల్పన, జి శ్రీనివాసరావు, రైతుకూలీ సంఘం నాయకులు ఆర్.మోహన్, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు జి.శేషయ్య, పలు ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డాక్టర్ చాపల వంశీకృష్ణకి ప్రతిష్ఠాత్మకమైన ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తింపు

### ఆస్టియోపోరోటిక్ బోన్ ఫ్రాక్చర్ల నివారణ కోసం అత్యధిక బోన్ మినరల్ డెన్సిటీ స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహించినందుకు గుర్తింపు






**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 10)**

ఒంగోలులోని శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు చెందిన సీనియర్ చీఫ్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ చాపల వంశీ కృష్ణకి ప్రతిష్ఠాత్మకమైన ఆసియ బుక్ అఫ్ రికార్డ్స్‌లో చోటు లభించింది. ఎముకల సాంద్రతను పరీక్షించి, ఆస్టియోపోరోసిస్ (ఎముకల బలహీనత) కారణంగా భవిష్యత్తులో ఎముకలు విరిగే ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి, వాటిని నివారించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలనే లక్ష్యంతో డాక్టర్ వంశీ కృష్ణ 2010 నుంచి ప్రతి నెలా నిరంతరాయంగా బోన్ మినరల్ డెన్సిటీ స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఈ నిరంతర ప్రజారోగ్య సేవల్లో భాగంగా, డాక్టర్ చాపల వంశీకృష్ణ మేయర్ ఆర్గానిక్స్ వారు 2025 డిసెంబర్ 3న అత్యధిక సంఖ్యలో నిర్వహించిన బోన్ మినరల్ డెన్సిటీ స్క్రీనింగ్ క్యాంపులలో పాల్గొన్నందుకు ఆయనకు ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధులు శ్రీరామ్ హాస్పిటల్‌కు విచ్చేసి డాక్టర్ వంశీ కృష్ణకి సర్టిఫికెట్‌ను అందజేశారు. “ఎముకల ఆరోగ్యంపై అవగాహన-ఫ్రాక్చర్ల నివారణ-ఆరోగ్యకరమైన జీవనం” అనే అంశం పై ప్రజలకు వైద్య సేవలు అందించడమే కాకుండా, వ్యాధులు రాకముందే వాటిని గుర్తించి నివారించాలనే లక్ష్యంతో డాక్టర్ వంశీకృష్ణ చేస్తున్న నిరంతర కృషికి ఈ గుర్తింపు ఒక ప్రత్యేక మైలురాయి. ఈ సందర్భంగా డాక్టర్ వంశీ కృష్ణని వైద్యులు, మిత్రులు అభినందించారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# బీసీల రాజకీయ, సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి టీడీపీ అండ

## స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం

## ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో బీసీ నేతల రౌండ్ టేబుల్ సమావేశం





(షణ్ముఖ వెలుగు, మార్టూరు, అక్టోబర్ 10)

బీసీల రాజకీయ, సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని బీసీ నేతలు స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న హామీకి కట్టుబడి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. శనివారం పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన బీసీ నేతల రౌండ్ టేబుల్ సమావేశంలో ఎంసీ చైర్మన్ గుంజి వెంకట్రావు, తెలుగుదేశం పార్టీ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి నక్కల రాఘవతో పాటు పలువురు బీసీ నాయకులు మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు సముచిత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడమే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని తెలిపారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బీసీలకు రాజకీయంగా మరింత ప్రాధాన్యం కల్పించి, వారి అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

**టీడీపీ హయాంలోనే బీసీలకు రాజకీయ ప్రాధాన్యం**

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలకు రాజకీయంగా తగిన ప్రాధాన్యం కల్పిస్తూ వస్తోందని నాయకులు పేర్కొన్నారు. దివంగత ఎన్టీ రామారావు బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో రిజర్వేషన్లకు ప్రాధాన్యం ఇచ్చారని, అనంతరం చంద్రబాబు నాయుడు బీసీలకు రిజర్వేషన్లను 34 శాతానికి పెంచేందుకు కృషి చేశారని వివరించారు. బీసీలు రాజకీయంగా ఎదగడానికి, స్థానిక సంస్థల్లో నాయకత్వ బాధ్యతలు చేపట్టడానికి టీడీపీ ఎన్నో అవకాశాలు కల్పించిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించారని విమర్శించారు. బీసీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేయడంతో పాటు బలహీనవర్గాలకు దక్కాల్సిన రాజకీయ ప్రాతినిధ్యానికి విఘాతం కలిగించారని ఆరోపించారు. బీసీలకు న్యాయం చేసే ప్రయత్నాలను కోర్టుల ద్వారా అడ్డుకోవడం సరికాదన్నారు. బీసీల అభ్యున్నతిపై మాట్లాడే ముందు వైసీపీ తన గత పాలనను సమీక్షించుకోవాలని హితవు పలికారు.

**బీసీలకు ఏలూరి పెద్దపీట : శంసుద్దీన్**

పర్చూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు బీసీలకు రాజకీయంగా ప్రాధాన్యం కల్పిస్తున్నారని బీసీ నాయకుడు షేక్ శంసుద్దీన్ పేర్కొన్నారు. మండల పార్టీ అధ్యక్ష పదవులతో పాటు రాష్ట్రస్థాయి డైరెక్టర్ పదవుల్లోనూ బీసీలకు అవకాశాలు కల్పించి నాయకత్వ బాధ్యతలు అప్పగించారని తెలిపారు. బీసీలు అన్ని రంగాల్లో ఎదగాలన్న చిత్తశుద్ధితో ఏలూరి పనిచేస్తున్నారని కొనియాడారు.

**తెలుగుదేశం పార్టీ బీసీలకు గుండె**

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కోడూరి శేషబ్రహ్మాచారి మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ బీసీలకు గుండె వంటిదని అభివర్ణించారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయానికి ఆటంకాలు కల్పించే ప్రయత్నాలను బీసీ సమాజం గమనించాలని అన్నారు. బీసీలంతా ఐక్యంగా ఉండి తమ రాజకీయ హక్కుల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మార్టూరు మండల టీడీపీ అధ్యక్షుడు శివరాత్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. బీసీలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పించడంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ముందుంటున్నారని తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు ఐక్యంగా పనిచేసి విజయాలు సాధించాలని కోరారు. కారంచేడు మండల టీడీపీ అధ్యక్షుడు షేక్ ఖాసిం మాట్లాడుతూ సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు' అనే నినాదంతో ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించారని గుర్తుచేశారు. బీసీలకు రాజ్యాధికారం కల్పించాలన్న ఎన్టీఆర్ ఆశయాలను చంద్రబాబు నాయుడు ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీ అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉండటం సంతోషకరమన్నారు.

**ఐక్యతతో విజయాలు సాధించాలి**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు సముచిత ప్రాతినిధ్యం లభించేలా నాయకులంతా సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు. బీసీ వర్గాలన్నీ కలిసికట్టుగా ముందుకు సాగి, ఎన్నికల్లో 100 శాతం విజయ లక్ష్యంతో పనిచేయాలని నేతలు ఆకాంక్షించారు.

రాజకీయ ప్రాతినిధ్యంతో పాటు సామాజిక, ఆర్థిక అభివృద్ధిలోనూ బీసీలు ముందుండేలా కూటమి ప్రభుత్వం సహకరిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వడ్లమూడి సాంబయ్య, ఉప్పుటూరు నరేంద్ర, వాటిపల్లి ఏడుకొండలు, కొక్కిలిగడ్డ రాములు, దండుప్రోలు బాలరాజు, విష్ణు, దండ్రుపోలు తిరుపతిరావు, జంజనం సాయి, షేక్ అక్రమ్, నాలి నాగరాజు, పాలేటి కోటేశ్వరరావు, మువ్వ ఆంజనేయులు, కొమ్మలపాటి లక్ష్మయ్య, జంజనం సుబ్బారావు, వాసు, పాల్గొన్నారు.

# చలో కలెక్టరేట్‌కు అనుమతి రద్దు

**ఈ నెల 12న ఒంగోలులో నిర్వహించ తలపెట్టిన కార్యక్రమానికి అనుమతులు లేవు**

**ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు కార్యక్రమానికి రావద్దు**

**ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు**



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, అక్టోబర్ 10)

ఎమ్మార్పీఎస్, ముస్లిం సంఘాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన ఒంగోలు జిల్లా కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన 'చలో కలెక్టరేట్' కార్యక్రమానికి ఇచ్చిన అనుమతులను రద్దు చేసినట్లు ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఒంగోలులోని డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ ఏడాది సింగరాయకొండలోని చైతన్య పాఠశాలలో విద్యార్థి మృతి, అనంతరం అతని తల్లి మృతి ఘటనలకు సంబంధించి పోలీసులు ప్రత్యేక దర్యాప్తు చేపట్టారని ఎస్పీ తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన అంశాలు హైకోర్టు పరిధిలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నెల 12న నిర్వహించ తలపెట్టిన కార్యక్రమానికి అనుమతులు కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు డీఎస్పీకి వినతిపత్రం సమర్పించారని చెప్పారు. అయితే, ఆ వినతిపత్రంలో పేర్కొన్న అంశాలకు జిల్లాలో నిర్వహిస్తున్న రౌండ్‌టేబుల్ సమావేశాల్లో చర్చిస్తున్న విషయాలకు పొంతన లేదని తెలిపారు. ఈ కార్యక్రమం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉన్నందున, జిల్లాలో అమల్లో ఉన్న 144 సెక్షన్, పోలీసు చట్టం (30 యాక్ట్) నిబంధనల నేపథ్యంలో సభలు, సమావేశాలకు అనుమతులు రద్దు చేసినట్లు వివరించారు. ఇటీవల జరిగిన ఘటనకు సంబంధించి ఎమ్మార్పీఎస్ నాయకులు పోలీసు అధికారులను నేరుగా కలిసి వివరాలు అడిగి తెలుసుకుని ఉంటే బాగుండేదని ఎస్పీ అభిప్రాయపడ్డారు. అలా చేయకుండా 'చలో కలెక్టరేట్'కు పిలుపునివ్వడం సరైన పద్ధతి కాదన్నారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించేందుకు పోలీసులు సిద్ధంగా ఉన్నారని, అయితే పోలీసు అధికారులను సంప్రదించకుండా ఆందోళనకు పిలుపునివ్వడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఈ నెల 12వ తేదీన ఒంగోలులోని జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించ తలపెట్టిన ధర్నాకు అనుమతులు లేనందున ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు ఎవరూ ఈ కార్యక్రమానికి హాజరుకావద్దని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ప్రజా హక్కులకు భంగం కలగకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సహకరించాలని కోరారు. ఈ మీడియా సమావేశంలో ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# కందుకూరు మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ నుండి కమిషనర్‌ను తొలగించాలి

**మున్సిపల్ వార్డుల పునర్విభజనలో అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరించిన అధికారుల పై చర్యలు తీసుకోవాలి**

**సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి**

**వైసీపీ పట్టణ కమిటీ పిలుపు**

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, అక్టోబర్ 10)

కందుకూరు మున్సిపాలిటీ వార్డుల పునర్విభజన పై జరిగిన అవకతవకలపై మున్సిపల్ కమిషనర్,అధికారులు బాధ్యత వహించి కందుకూరు మున్సిపల్ ఎన్నికల నిర్వహణ నుంచి తప్పుకోవాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కందుకూరు మున్సిపాలిటీ వార్డులను పెంచుతూ గురువారం విడుదల చేసిన ముసాయిదాలు అనేక తప్పులు తడకలు ఉన్నాయి. వార్డు నైసర్గిక స్వరూపాన్ని,భౌగోళిక పరిస్థితులను పరిగణలోకి తీసుకొనకుండా అధికార పార్టీకి అనుగుణంగా ఉండేందుకు అడ్డదిడ్డంగా వార్డులను విభజించారు. దీనివలన మున్సిపాలిటీకి సంబంధించిన అనేక సమస్యలు వార్డులలో ఉత్పన్నమవుతాయని తెలిపారు. అసమగ్రంగా,అధికార పార్టీకి అనుకూలంగా మునిసిపల్ అధికారులు అధికార పార్టీ నాయకుల సమక్షంలో గెస్ట్ హౌస్ లో కూర్చుని రూపొందించినట్లు ప్రముఖ పత్రికల్లో పెద్ద ఎత్తున మున్సిపల్ అధికారులపై ఆరోపణలు వచ్చాయి. మున్సిపల్ ప్రజల మనోభావాలకు అనుగుణంగా కాకుండా అధికార పార్టీకి తొత్తుగా విభజన చేసినందుకు నైతిక బాధ్యత వహిస్తూ ఎన్నికల ప్రక్రియనుండి మున్సిపల్ కమిషనర్ వైదొలగాలని సూచించారు. అవసరమైతే రాష్ట్ర ఎన్నికల సంఘానికి కూడా ఫిర్యాదు చేస్తామని అన్నారు. ప్రజాస్వామ్యంలో స్థానిక ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో జరపాలి. దీనికి భిన్నంగా మున్సిపాలిటీ అధికారులు అధికార పార్టీకి వత్తాసు పలికే విధంగా వ్యవహరిస్తున్నారు. దీనికి నిరసనగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కందుకూరు నియోజకవర్గ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 10 గంటలకు కందుకూరు మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్‌కి అభ్యంతరాలు తెలియజేస్తూ వినతి పత్రాలను సమర్పిస్తుంటే కనీసం పార్టీల అభిప్రాయాలను కూడా స్వీకరించే స్థితిలో లేరు. ఎన్నికలకు సంబంధించిన పునర్విభజన ముసాయిదా ప్రతులను, ఓటర్ల ప్రతులను అడిగితే ఎమ్మెల్యే ఎమ్మెల్సీకి తప్ప ఎవరికీ ఇచ్చేది లేదని, రాజకీయ పార్టీలకు ఇవ్వమని మాకు చెప్పలేదని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. కందుకూరు మున్సిపల్ లోని ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు చెప్పిన తీర్పుకు అనుగుణంగా మున్సిపల్ యాక్ట్ లోని అంశాలను సైతం పాటించకుండా వార్డుల పునర్విభజన జరపకుండా అధికార పార్టీకి మేలు చేసే విధంగా మున్సిపల్ అధికారులు వ్యవహరిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ కలిసి మీ, మీ వార్డు సరిహద్దుల అభ్యంతరములను తెలియజేయుటకు పట్టణ ప్రాంతంలోని అన్ని వార్డుల ప్రజలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అందరూ కలసి రావలసిందిగా కోరారు. ఇప్పటికైనా వార్డుల పునర్విభజనను శాస్త్రీయంగా విభజన చేయాలని, గూగుల్ మ్యాప్ ద్వారా ప్రాంతాలను గుర్తించి అన్ని సామాజిక వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వార్డుల పునర్ విభజన చేయాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు సంఘీభావంగా వివిధ పార్టీలు కూడా స్వచ్ఛందంగా రావాలని విజ్ఞప్తి చేశారు.

# మాదిగలకు మాచర్ల మున్సిపల్ చైర్మన్ పదవి కల్పించాలి

**40 ఏళ్లుగా దక్కని అవకాశం**

**ప్రధాన రాజకీయ పార్టీలు స్పందించాలి**

**రాజకీయ పార్టీలు అవకాశం ఇవ్వకపోతే స్వతంత్ర అభ్యర్థిని బరిలోకి దింపుతాం**

**మాదిగల రాజకీయ చైతన్య వేదిక అల్టిమేటం**





(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, అక్టోబర్ 10)

మాచర్ల మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుండి సుమారు 40 ఏళ్లుగా ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి మున్సిపల్ చైర్మన్ పదవి దక్కకపోవడం బాధాకరమని మాదిగల రాజకీయ చైతన్య వేదిక ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం మాచర్ల పట్టణంలోని అంబేద్కర్ పార్కులో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాదిగ రాజకీయ మేధావులు మాట్లాడుతూ ప్రధాన రాజకీయ పార్టీలు వివిధ సామాజిక వర్గాలకు చైర్మన్ పదవికి అవకాశాలు కల్పించినట్లే, మాదిగ సామాజిక వర్గానికి కూడా చైర్మన్ పదవి కల్పించాలని అన్ని రాజకీయ పార్టీలను కోరారు. ఎన్నికల సమయంలో ఓటు బ్యాంకుగా ఉపయోగించుకోవడం కాకుండా, మాదిగలకు రాజకీయ ప్రాతినిధ్యం, ఆత్మగౌరవం కల్పించాలని అన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో రిజర్వేషన్‌తో సంబంధం లేకుండా మాదిగలకు చైర్మన్ పదవి ఇచ్చేవిధంగా రాజకీయ పార్టీలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. మాదిగలకు అవకాశం కల్పించని పక్షంలో ర్యాలీలు, ధర్నాలు నిర్వహించడంతో పాటు, అవసరమైతే మాదిగల రాజకీయ చైతన్య వేదిక బలపరచిన స్వతంత్ర అభ్యర్థిని నిలబెట్టి గెలిపించుకుంటామని హెచ్చరించారు. సామాజిక న్యాయం, సమాన రాజకీయ అవకాశాల దిశగా అన్ని పార్టీల నాయకులు సానుకూలంగా స్పందించాలని మాదిగ రాజకీయ చైతన్య వేదిక ప్రతినిధులు కోరారు. మాదిగలను ఓటు బ్యాంకుగా చూస్తున్నారు తప్ప ఉన్నత రాజకీయ పదవులు కల్పించడం లేదన్నారు. మాచర్లలో మాదిగలకు ఓటు బ్యాంకు ఉన్నప్పటికీ మున్సిపల్ చైర్మన్ వంటి కీలక పదవులు ఎందుకు కల్పించడం లేదని ప్రశ్నించారు. ఎన్నికలు వచ్చినప్పుడు మాదిగ సామాజిక వర్గానికి చెందిన ప్రజలను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటున్నారని డబ్బులు, మద్యం వంటి ప్రలోభాలతో ఓట్లు పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అయితే రాజకీయ పదవులు ఉన్నత స్థానాలు కల్పించే విషయంలో మాత్రం తమ సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాచర్లలో మాదిగ సామాజిక వర్గాన్ని చిన్నచూపు చూస్తున్నారని చైర్మన్ పదవిని శాసించే ఓటు బ్యాంకు ఉన్నప్పటికీ రాజకీయంగా ఎదిగేందుకు అవకాశాలు కల్పించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే తమను గుర్తు చేసుకోవడం కాకుండా రాజకీయంగా ముందుకు తీసుకెళ్లేందుకు నాయకులు చొరవ చూపాలని కోరారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం కల్పించిన సామాజిక న్యాయం, సమానత్వ స్ఫూర్తికి అనుగుణంగా అణగారిన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని అన్నారు.

మాదిగ సామాజిక వర్గం కూడా అభివృద్ధి చెందాలని ఉన్నత పదవులను అధిరోహించే అవకాశం పొందాలని ఆకాంక్షించారు. రాజకీయ పార్టీలు తమ వైఖరిని మార్చుకొని మాదిగ సామాజిక వర్గానికి తగిన గుర్తింపు,గౌరవం, ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ నాయకులు మాచర్ల రూబెన్ మాదిగ, మాచర్ల పట్టణ అధ్యక్షులు బొల్లెద్దుల మరి బాబు మాదిగ, మాజీ మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన యేసోబు, ఎంసిపిఐ రాష్ట్ర నాయకులు పోలేపల్లి అబ్రహం లింకన్, టిడిపి నాయకులు మాచర్ల వాసు పేరువాల పుల్లారావు, కంభంపాటి దానంబాబు, బిజెపి ఆలేటి సామ్యేల్,వైసీపీ నాయకులు వేల్పుల గురవయ్య,అల్లి జీవన్, కందుకూరి మధు,కోట రాజేష్,యలకపాటి రమేష్ బాబు, మాచర్ల హరీష్, మాచర్ల పవన్, బొల్లెద్దుల శివ, బొల్లెద్దుల సంసోను,ఆలేటి యలమంద, బాబురావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం చేయిచేయి కలిపి వర్ధిల్లాలి మాదిగల ఐక్యత, మాదిగలకు చైర్మన్ పదవి కల్పించాలి అంటూ నినాదాలు ఇస్తూ సంఘీభావం తెలిపారు.